## భక్తులకు లడ్డూల విక్రయాలపై పరిశీలన

### -ఉగ్రాణం,లడ్డూకౌంటర్ల తనిఖీల్లో అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల,ఆగస్ట్ 6(ప్రభాతవార్త)ప్రతినిధి: తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు స్వామివారి దర్శనం తరువాత లడ్డూప్రసాదం విక్రయించే కౌంటర్లలో భక్తులకు సంతృప్తికర సేవలందించడంపై టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆరా తీశారు. లడ్డూకౌంటర్లలో సేవలందించే సిబ్బంది, సేవకులు భక్తిభావంతో విధులు నిర్వహించేలా చూస్తున్నారు. కౌంటర్లలో లడ్డూట్రేలను, కల్యాణం లడ్డూలను, వడ ప్రసాదాల విక్రయాలను ఆయన పరిశీలించారు. ఈ తనిఖీల్లో అదనపు ఈఓవెంట విఎస్ఓ నందకిశోర్, పోటు ఎఈఓ శ్రీనివాసులు, ఆలయ అధికారులు ఉన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త



## భక్తిశ్రద్ధలతో ఆడిపొంగళ్ళు



శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త పట్టణంలోని 33వ వార్డు ప్రాజెక్టు వీధిలో మంగళవారం ఆడిపొంగళ్ళను మహిళలు, భక్తులు అందరు కలసి అమ్మవారి ఉత్సవమూర్తి ముందు సమర్పించారు. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి సప్పరంలో అలంకరించారు. అనంతరం పూజలు నిర్వహించడంతో మహిళలు అమ్మవారిని దర్శించుకుని ఆడిపొంగళ్ళు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారిని గజమాలతో అలంకరించడంతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో పలువురు భక్తబృందం పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

### - కలెక్టరేట్ ఎదుట ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థుల మహాధర్నా



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం సాగిస్తామని ఎఐఎస్ఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాను ఉద్దేశించి ఎఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వందకు పైగా ప్రభుత్వ హాస్టల్స్ వుంటే అందులో 70 శాతం హాస్టల్ భవనాలు పాతపడి కూలిపోవడానికి సిద్ధంగా వున్నాయని ఆరోపించారు. విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో వుంచుకుని సత్వరం కొత్త హాస్టల్ భవనాల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో వున్న హాస్టల్ విద్యార్థుల కాస్మోటిక్, మెస్ ఛార్జీలను విడుదల చేయాలన్నారు. జిల్లాలోని పలు హాస్టళ్ళలో పరిమితికి మించి విద్యార్థులు వుంటున్నారని, విద్యార్థులకు అనుగుణంగా హాస్టళ్ళను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హాస్టళ్ళలో విధులు నిర్వహిస్తున్న ట్యూటర్లకు గత ఏడాది నుండి జీతాలు లేవని సత్వరం వారికి జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో చేపట్టాలని కోరారు. ఇచ్చిన హామీలను చంద్రబాబు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఆందోళన చేయడానికి సిద్ధంగా వున్నారని వారు హెచ్చరించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి, జిల్లా కన్వీనర్ ప్రవీణ్, నాయకులు మున్నా, ప్రేమ్, సమీర్, బాలాజీ, సునీల్, పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరయ్యారు.

# టిడ్కో ఇళ్ళనూ అమ్మేశారు!



### ఐదేళ్ళ క్రితం లబ్దిదారులకు టోకెన్లు : బ్యాంకుఅప్పుకు ఒప్పందం
### ఓ వైపు మరమ్మతులు.. మరో వైపు తలలు పట్టుకుంటున్న అధికారులు

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు కేంద్రం,రాష్ట్రం కలసి సబ్సిడీలను అందించి పక్కాగృహాలను అపార్టుమెంట్లుగా ఇవ్వటానికి పథకం రూపొందించారు. ఆచరణలో జాప్యంతో గందరగోళంగా మారింది. మరి పాలకులో అధికారులో పక్కాగా వ్యాపారం చేసుకున్నారు. ఒక్కొక్క అపార్టుమెంటును రూ.3 నుంచి 5లక్షలకు అమ్ముకున్నట్లు ఆరోపణలు రాజ్యమేలుతున్నాయి. అయితే గతంలో టోకెన్లు పొందిన లబ్దిదారులు తమకు ఇళ్ళు కేటాయించమని కోరుతున్నారు. గతంలో టిడ్కో ఇళ్ళు వస్తాయో రావో అనే సందిగ్ధంలో జగనన్న కాలనీలో సుమారు 1100 మందికి అవకాశం కల్పించారు. వారు అక్కడికి కూడా వెళ్ళలేదు. ప్రభుత్వం మారటంతో నేడు లబ్దిదారులు తమకు ఆపార్టుమెంటులో కేటాయించిన ఇళ్లను ఇవ్వాలని అధికారుల మీద వత్తిడి తెస్తున్నారు. నాయకుని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**ఏళ్ళు గడుస్తున్నా . . .**

ఇందులో శ్రీకాళహస్తి మున్సిపాలిటికి 6015 ఇళ్లను మంజూరు చేసారు.2017లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో బొజ్జలగోపాలకృష్ణారెడ్డి టిడ్కో ఇళ్ళను రూపకల్పన చేసారు. 6వేల మంది లబ్దిదారులను ఎంపిక చేసారు.రాజీవ్‌నగర్ సమీపంలో నాగార్జున కన్స్ట్రక్షన్స్ సారధ్యంలో ఇళ్ళను నిర్మించుటకు లబ్దిదారులను ఎంపిక చేసారు. మూడు వర్గాలుగా విభజించారు. నిరుపేదలకు రూ.500లకు మధ్య తరగతి వారికి రూ.50వేల డిపాజిట్ డబుల్ బెడ్ రూం కావాల్సిన వారికి రూ.,లక్ష డిపాజిట్ అని ప్రకటించారు. దాంతో లబ్దిదారులు పోలో మని ముందుకు వచ్చారు.ఇక్కడ 6015 మంది లబ్దిదారులు దరఖాస్తులు చేసుకోగా చివరకు 4064 మందిని ఎంపిక చేసారు.ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల (రూ.3లక్షలు సబ్సిడీ)భాగస్వామ్యంతో పాటు లబ్దిదారునికి బ్యాంకు ద్వారా (రూ.3.15 లక్షలు)రుణం కూడా మంజూరు చేయించారు.బ్యాంకు రుణం తీరిన తరువాత లబ్దిదారునికి ఇంటికి సంబంధించిన రికార్డులు అందిస్తామని ప్రకటించి ఎంపిక చేసారు.

**2019లో హంగామాగా . . .**

శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్ సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ళను లబ్దిదారులకు కేటాయించుటకు పెద్ద సభను మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసారు. ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కమిషనరే నాడు కూడా ఉన్నారు. లబ్దిదారులకు ఇళ్ళను కులుకు పద్దతిలో కేటాయించారు. టోకెన్లు జారి చేసారు. అయితే ఇళ్ళను ఉగాది నాటికి గృహాప్రవేశాలు అంటూ ప్రకటించారు. లబ్దిదారులు సంతోష పడిపోయారు. తీరా తెలుగుదేశం ప్రభుత్వ పాలనకు లబ్దిదారులు చరమగీతం పాడారు. అప్పటి నుంచి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. లబ్దిదారులకు బ్యాంకులు రుణంపై వాయిదాలను చెల్లించాలని నోటీసులు జారీ చేసారు. దాంతో లబ్దిదారుల ఆవేదన రోదన అంతా ఇంతా కాదు.ఐదేళ్ళుగా వడ్డీలు చేసి డిపాజిట్లు కట్టిన లబ్దిదారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**ప్రారంభమైన మరమ్మతులు:**

శ్రీకాళహస్తిలోని రాజీవ్ నగర్‌కు సమీపంలో వెలసిన టిడ్కో ఇళ్ళను లబ్దిదారులకు అందించుటకు ప్రస్తుత ప్రభుత్వం అధికారులను పరుగులు తీయిస్తుంది. అంతేకాక కాంట్రాక్టర్‌పై వత్తిడి తెస్తున్నారు. గత ఐదేళ్ళలో పనులు ప్రారంభం కాకపోగా కాంట్రాక్టర్ పనుల కోసం స్టోర్ చేసిన తలుపులు,కిటికీలు,ద్వారబంధాలను కొందరు దర్జాగా తీసుకెళ్లి అమ్ముకున్నారు. ఇళ్ళను కొందరు అధికారులు సొంత ఎస్టేట్‌లా తమకు కావాల్సిన వారికి పట్టాలు ఇచ్చుకున్నారు. సొమ్ము చేసుకున్నారు. మళ్లి ప్రస్తుతం పరుగులు తీస్తున్నారు. మరి ఏమౌతుందో ఏమో? చూడాలి.

# కొత్త జంక్షన్ల ఏర్పాటుకు చేయూత

### - ఇండియన్ రైల్వే బోర్డు ఛైర్‌పర్సన్ ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో కొత్త జంక్షన్ల ఏర్పాటుకు చేయూత ఇవ్వాలని ఇండియన్ రైల్వే బోర్డు ఛైర్‌పర్సన్‌కు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో పార్లమెంటు సమావేశాలకు హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఇండియన్ రైల్వే బోర్డు ఛైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రైల్వే సమస్యలపై వినతిపత్రం అందజేశారు. చిత్తూరు జిల్లాలో కుప్పం, చిత్తూరు, చంద్రగిరి రైల్వేస్టేషన్లను ఆధునీకరించి ఆయా స్టేషన్లలో జంక్షన్లను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లలో ప్రయాణీకులకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఇండియన్ రైల్వే బోర్డు అధికారులు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. కుప్పం రైల్వే స్టేషన్‌లో కోచింగ్ టర్మినల్ ఏర్పాటు చేయడం ద్వారా ఆ స్టేషన్‌కు ప్రగతి బాటలు వేసినట్లు అవుతుందన్నారు. అలాగే తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి కుప్పం, చిత్తూరు, చంద్రగిరి రైల్వే స్టేషన్ల మీదుగా అనేక యాత్రికులు తిరుపతికి చేరుకునే అవకాశం వుందన్నారు. ఫలితంగా తిరుపతి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ఏర్పడి పలు నిర్వహణ సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశం వుందన్నారు. ఈ పరిస్థితుల్లో కుప్పం, చిత్తూరు, చంద్రగిరి రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి సంబంధిత స్టేషన్లలో జంక్షన్లు ఏర్పాటు చేస్తే తిరుపతి రైల్వే స్టేషన్‌పై ఒత్తిడి తగ్గే అవకాశం వుందన్నారు. అలాగే మన రాష్ట్రంతో పాటు సరిహద్దు రాష్ట్రాల నుండి ప్రయాణీకులు సులభంగా పుణ్యక్షేత్రం అయిన తిరుపతికి ప్రయాణించే అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. అలాగే కుప్పం నియోజకవర్గ ప్రజలను దృష్టిలో వుంచుకుని, ప్రస్తుతం రోజు నడుస్తున్న చిత్తూరు-కాచిగూడ వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును కుప్పం వరకు పొడగించాలని కోరారు. అలాగే వారానికి ఒకసారి నడుపుతున్న తిరుపతి-సికింద్రాబాద్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతిరోజు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు విన్నవించారు. ఈ విషయాలపై రైల్వే బోర్డు ఛైర్మన్ స్పందించి చిత్తూరు జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లను అన్ని రకాలుగా ఆధునీకరించడానికి రైల్వే బోర్డు సమాయాత్తం అయ్యిందని, తక్కువ కాలంలోనే అన్ని రైల్వేస్టేషన్లు ఉన్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుంటాయని ఎంపీకి తెలిపారు. నూతన రైల్వే జంక్షన్ల ఏర్పాటు కోసం సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్సీ భరత్‌పై చీటింగ్ కేసు

### - శ్రీవారి తోమాలసేవ దర్శనం కల్పిస్తానని మోసం

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: జిల్లా వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్‌పై గుంటూరు జిల్లా ఆరుండాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తిరుమల వెంకటేశ్వరస్వామి తోమాలసేవ దర్శనం కల్పిస్తానని తమ నుండి 2.25 లక్షల రూపాయల నగదు వసూలు చేసుకుని ఆపై తమకు ఎలాంటి దర్శనం కల్పించలేదని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎమ్మెల్సీ భరత్, ఆయన పిఎ మల్లికార్జున్‌పై కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా నుండి తిరుమల శ్రీవారి తోమాలసేవ దర్శనానికి ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 24 మంది భక్తులు వచ్చారు. వీరికి తిరుమలలో శ్రీవారి తోమాలసేవ దర్శనం కల్పిస్తానని ఎమ్మెల్సీ భరత్ పిఎ అయిన మల్లికార్జున సొమ్ము తీసుకున్నాడు. తోమాల సేవ కోసం వచ్చిన 24 మంది భక్తుల నుండి దర్శనం కల్పిస్తానని చెప్పి సొమ్ము తీసుకున్న మల్లికార్జున ఆపై వారికి దర్శనం కల్పించకుండా మోసం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు బాధితులు మూడు నెలల అనంతరం గుంటూరు జిల్లా ఆరుండాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో తమకు తిరుమల తోమాల సేవ దర్శనం కల్పిస్తానని చెప్పి ఎమ్మెల్సీ భరత్, అతని పిఎ మల్లికార్జునలు తమ నుండి 2.25 లక్షలు తీసుకున్నారని ఈ వ్యవహారంపై విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

### నాకేందుకు దర్శనం టిక్కెట్లు అమ్ముకునే ఖర్మ : ఎమ్మెల్సీ భరత్



కలెక్టర్ కుటుంబం నుండి వచ్చిన నాకు తిరుమల శ్రీవారి దర్శనం టిక్కెట్లు అమ్ముకునే ఖర్మ పట్టలేదని ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఆరుండాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్సీ భరత్, పిఎ మల్లికార్జున్‌పై కేసు నమోదు కావడంపై స్పందించిన ఆయన తనకు మల్లికార్జున అనే వ్యక్తి ఎవరో తెలియన్నారు. మల్లికార్జున అనే వ్యక్తే తనకు తెలియకపోతే తాను బాధితుల నుండి శ్రీవారి తోమాలసేవ దర్శనం కల్పిస్తానని ఎలా డబ్బులు తీసుకుంటానన్నారు. కుప్పంలో తాను సిఎం నారా చంద్రబాబునాయుడును ధీటుగా ఎదుర్కొంటుండ టంతో తనపై రాజకీయ కక్ష సాధించడానికి ఇలాంటి తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## తిరుపతి-విజయవాడ రెండు ఆర్టీసి బస్సులు ప్రారంభం

### -రవాణామంత్రి రాంప్రసాద్‌రెడ్డి



తిరుపతిటౌన్,ఆగస్ట్ 6(ప్రభాతవార్త: పుణ్యక్షేత్రం తిరుపతి నుండి రాష్ట్రరాజధాని విజయవాడ నగరానికి రెండు ఆర్టీసి అద్దె బస్సులను మంగళవారం రాష్ట్రరవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. తిరుపతి నుండి రోజూ విజయవాడకు నూతన బస్సుసర్వీసులు నడుస్తాయన్నారు. ప్రతిరోజూ ఉదయం తిరుపతిలో 10.15గంటలకు బయలుదేరుతాయని, విజయవాడలో ఉదయం 6గంటలకు మరొక బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి టి.చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సిటిఎం ఎం.భాస్కర్, డిసిఎంఇ నరసింహులు ,డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

### పక్కాగా బిందు, తుంపర్ల సేద్యం

## లక్ష్యం పూర్తి

### కలెక్టర్ సుమిత్‌కుమార్



చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: బిందు, తుంపర్ల సేద్యంకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశించిన లక్ష్యంను పక్కాగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. జిల్లా సచివాలయంలోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ బిందు, తుంపర్ల సేద్యం పరికరాల పంపిణీపై వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖలకు సంబంధించి జిల్లా, నియోజకవర్గా, మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుకు మేలు చేయడానికి అందుబాటులో వున్న సాగునీటి వనరులను సద్వినియోగం చేసుకుని బిందు, తుంపర్ల సేద్యంను సంబంధించి పరికరాలను సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 21 వేల హెక్టార్ల విస్తీర్ణం లక్ష్యం నిర్ధేశించగా ఈ వంద రోజుల కార్యాచరణ మేరకు 3,500 హెక్టార్ల విస్తీర్ణంను పక్కాగా పూర్తి చేయాలన్నారు. రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సత్వరం ప్రారంభించాలని, ఈ లక్ష్యాలను అధికమించడానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు జిల్లా నుండి క్షేత్ర స్థాయి వరకు సమిష్టిగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమన్వయం చేసుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను సత్వరం ప్రారంభించాలన్నారు. అలాగే ఉపాధి పథకంలో హార్టికల్చర్ ప్లాంటేషన్ లక్ష్యం 7,500 ఎకరాలు అని, ఇప్పటికే ఇందులో 5,500 ఎకరాలు గుర్తించడం జరిగిందని, మరో 2 వేల ఎకరాలను గుర్తించడానికి ఉపాధి సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్ళాలని డ్వామా పిడి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, ఎపిఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి శోభారాణి, అధికారులు పాల్గొన్నారు.

## షటిల్‌కోర్టు వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు

### -మంత్రి మండిపల్లి రాంప్రసాద్



పుంగనూరు,ఆగస్టు 6 ప్రభాతవార్త పట్టణంలో ఫ్రెండ్స్ షటిల్ కోర్టు భవనాన్ని కూల్చివేసిన విషయంపై దర్యాప్తు అవసరమని, దీనిపై తగిన విధంగా స్పందిస్తామని రాష్ట్ర రవాణా,యువజన క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొత్తఇండ్లు వద్ద ధ్వంసమై పోయిన షటిల్ కోర్టు భవన స్థలాన్ని మంత్రితో పాటూ దేశం ఇన్‌చార్జి చల్లాబాబు పరిశీలిం చారు. ఈసందర్భంగా ఆయనకు ఫ్రెండ్స్ షటిల్ సంఘ నాయకులు సిఎస్ రాజారెడ్డి, నానబాలకుమార్,భాస్కరజెట్టిలు రాత్రికి రాత్రి జరిగిన ధ్వంస రచనను ప్రత్యక్షంగా చూపించారు. దీనిపై ఆయన స్పందిస్తూ షటిల్‌కోర్టు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి తగిన విధంగా సాయం ఉంటుందన్నారు.

## శిల్పకళాకారుల జీవనోపాధుల పెంపునకు చర్యలు : జెసి

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

కుప్పం ప్రాంతంలో ఉన్న గ్రానైట్ శిల్పకళాకారుల జీవనోపాధుల పెంపుకు చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, డిఐఒ సంజీవరాజు, దేవదాయ శాఖ సహాయ కమీషనర్ లక్ష్మీ ప్రసన్న, కార్మిక శాఖ సహాయ కమీషనర్ ఓంకార్ రావుతో కలసి నియోజకవర్గంలో ఉన్న శిల్ప కళాకారులు వారి అవసరాలు గుర్తించేందుకు సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన సందర్భంగా కుప్పం ప్రాంత శిల్పకళాకారులను ప్రోత్సహించేందుకు వారి జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు ఆదేశాలిచ్చారన్నారు. కుప్పంలో గ్రానైట్ శిల్పాల తయారీ, వాటి విక్రయాలకు సంబంధించి ప్రదర్శన, విక్రయ శాలల ఏర్పాటుకు భూములు గుర్తించాలని ఆదేశించారన్నారు. సమావేశంలో రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు,డా॥ వెంకటేష్, సుమన్ ప్రియ, తహశీల్దార్ చిట్టిబాబు, ఉప తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్వోలు, శిల్పకళాకారులు పాల్గొన్నారు.

## నగర శుభ్రతకు ప్రజలు సహకరించండి

### భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త రోడ్లపై వెయ్యోద్దు :కమిషనర్ మౌర్య



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 6, ప్రభాతవార్త అనుమతులు లేకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా నగరంలో హోర్డింగులు, ప్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య హెచ్చరించారు. మంగళవారం తెల్లవార జాము నుండి పారిశుద్ధ్య పనులను, అన్నా క్యాంటీన్ల పున: ప్రారంభోత్సవ పనులను, డ్రైనేజీ కాలువలను, ఇంజినీరింగ్, హెల్త్ అధికారులు, సిబ్బందితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడపడితే అక్కడ, డివైడర్ల మధ్యలో ప్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. దీంతో ప్రజలకు, వాహన చోదకులు ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తెల్లవారుజామున కవర్లు, గోతాల్లో చెత్త రోడ్లుపై వేస్తున్నారని, వీటి వలన అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రతి రోజు తమ సిబ్బంది మీ ఇంటి వద్దకే వస్తున్నారని, వారికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇచ్చి సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలను నగరంలో రోడ్లపైనే, పక్కనే పడేస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసే ప్లాంట్ తమ వద్ద ఉందని, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి సమాచారం ఇస్తే ప్లాంట్‌కు తరలిస్తారని అన్నారు. చెత్త భవన నిర్మాణ వ్యర్థాలు ఎక్కవపడితే అక్కడ వేసి పరిశుభ్రతను పాడుచేయవద్దని కమిషనర్ విజ్ఞప్తి చేసారు. చెత్త, భవన నిర్మాణ వర్ధాలు రోడ్డుపై వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వినాయక సాగర్ ఆహ్లాదంగా, శుభ్రంగా ఉంచుతామని, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో ఎక్కడా వర్షపునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డిఈలు విజయ కుమార్ రెడ్డి, శ్రావణి, శానిటరీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## ఏనుగుల కదలికలపై ట్రాకర్లకు శిక్షణ



రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త అటవీ ప్రాంతాల్లో ఏనుగుల కదలికపై ట్రాకర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అటవీ అధికారి చైతన్య కుమార్‌రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగులను దారి మళ్లించేందుకు వినియోగించే వివిధ రకాల గన్‌లను ప్రదర్శించారు. అంతకుముందు కడ పిడి వికాస్ మర్మత్ ననియాల ఏనుగుల క్యాంప్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో జయశంకర్, డిఆర్వోలు పుల్లయ్య, ధనుంజయులు, నేతలు ఆనందరెడ్డి, నరసింహులు, మునస్వామి, పత్ర నారాయణ, చిన్నికృష్ణ, మురళి, మనోహర్ పాల్గొన్నారు.



## శ్రీ ముత్తుమారెమ్మకు ప్రత్యేక పూజలు

కుప్పంరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త

కుప్పం పట్టణం రామచంద్రారోడ్‌లో వెలసిన శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం మహిళా భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి అంబలి సమర్పణ కార్యక్రమం జరిపారు. సాయంత్రం మహిళా భక్తులు అమ్మవారి ఆలయం ఎదుట ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా బుధవారం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ ఛైర్మన్ హర్ష ధర్మతేజ, సభ్యులు తెలిపార్లు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## మహిళాసంఘాలచే రాజధాని నిర్మాణానికి రూ.57వేల విరాళం

కుప్పంరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త



రాజధాని అమరావతి నగర నిర్మాణం కోసం మున్సిపల్ పరిధి లక్ష్మీపురం వార్డు మహిళా సమాఖ్య వారు యాభై ఏడువేల ఐదువందల రూపాయల విరాళాన్ని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ విరాళ ం ఇచ్చిన మహిళల్ని అభినందించారు. మున్సిపల్ ద్వారా చెత్త సేకరణ వాహనాలు ఇళ్ల వద్దకే వస్తాయని ప్రజలు వాటిలోనే చెత్తను వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, బాలు, లోకేష్, పిఒ జగదీష్, సిఒ శోభ పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

శ్రీరంగరాజపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



ఉద్యానవన పంటలకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎపిడి శోభన్‌బాబు పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మునగ, మామిడి, సపోటా, జామ, డ్రాగన్‌ఫ్రూట్, అంజీర, నిమ్మ, చీని, ఆపిల్, బేరి లాంటి చెట్ల సాగుపై రైతులకు తెలియజేయాలన్నారు. పంటలు సాగు చేయడానికి సిద్దమైన రైతులను ప్రోత్సహించి వారితో పంటలు సాగు చేయించేలా చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఓ మోహన్‌మురళి, ఎపిఓ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## తహసిల్దారుగా అరుణకుమారి బాధ్యతలు స్వీకరణ

పాలసముద్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల తహసిల్దారుగా మంగళవారం అరుణ కుమారి బాధ్యతలు చేపట్టారు. గతంలో తవణం పల్లి మండల తహసిల్దారుగా విధులు నిర్వర్తించిన అరుణ కుమారి ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రభుత్వం తహసిల్దార్లను వారి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ అరుణకుమారిని పాలసముద్రం తహసిల్దారుగానియమిస్తూఉత్తర్వులుజారీ చేశారు.అరుణకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరిం చారు.

## గంగమ్మను దర్శించుకున్న జిల్లా 'దేశం' అధ్యక్షులు సిఆర్ రాజన్

గుడిపాల, ఆగస్టు 6 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పాపసముద్రం పంచాయతీ అడ విచేను గ్రామంలో మంగళవారం గంగజాతర ప్రారం భమైంది, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ మంగళవారం గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అంబళ్ళు, పొంగళ్ళతో గంగమ్మను నైవేద్యం సమర్పించారు. గంగమ్మను దర్శించుకోవడానికి విచ్చేసిన జిల్లా దేశం అధ్యక్షుడు సిఆర్ రాజన్‌కు స్థానిక తెలుగుదేశం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.మాజీ జడ్పీటీసీ సుమతి మురళి, దేశం నాయకులు ఆరుముగం, గణేష్, అర్జున్, పయణి, శంకర్, సూర్య, గుణ, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి సమిష్టికృషి

గుడిపాల, ఆగస్టు 6 ప్రభాతవార్త:

మండల పరిధిలో బిజెపి బలోపేతంకు సమిష్టిగా కృషి చేయాలని మండల బిజెపి అధ్యక్షుడు ధనంజయనాయుడు నాయకులకు పిలుపునిచ్చారు. మండల బిజెపి పార్టీ కార్యాలయంలో మంగళవారం బిజెపి బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ధనంజయనాయుడు మాట్లాడుతూ ప్రధాని మోడి నేతృత్వంలో భారత్ ప్రపంచ దేశాల్లో డైనమిక్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు చంద్ర, మాధవ్, మురారి, గోపి, రాజమణి, వేలాయుధం, రవి, జయవేల్ తదితరులు పాల్గొన్నారు.

## 11న కాణిపాకం ఆలయ ఉభయదారుల సమావేశం

కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఉభయదారులు సమావేశం ఈనెల 11న జరుగుతుందని ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. దేవస్థానంలో జరుగనున్న 2024 స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను 21 రోజుల పాటు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లుపై ఉభయదారుల సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. స్థానిక మణికంఠేశ్వరాలయ ఆవరణలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశానికి ఆలయ ఉభయదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు

## కాకర్లవారిపల్లెలో ఘనంగా అక్కగార్లకు పొంగళ్ళు

కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త:



కాణిపాకం పంచాయతీ కాకర్లవారిపల్లె గ్రామ సమీపంలో వెలసిన అక్కగార్లకు మంగళవారం గ్రామస్థులు ఘనంగా పొంగళ్ళు పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రతి ఏటా గ్రామ పొలిమేర్లలలో వెలసిన అక్కగార్ల దేవతలకు పొంగళ్ళు పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహిస్తుంటారు. ఈమేరకు మంగళవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈపూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో అక్కగార్ల దేవతలకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు మల్లారపల్లె గిరిధర్‌బాబు, జయప్రకాష్‌నాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూదన్‌రావు, నాయకులు నరసింహులు నాయుడు, పూర్ణచంద్రరావు, శేషాద్రినాయుడు, రమేష్‌నాయుడు, బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శిశువుకు పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి

తవణంపల్లె, ఆగస్టు 6 ప్రభాతవార్త:

శిశువు పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని అది మొదటి టీకాగా పనిచేస్తుందని ఐరాల సీడీపీఓ జి.నిర్మల అన్నారు. మంగళవారం మండలంలోని మొదలపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువుకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, తల్లిపాలు బిడ్డకు ఇన్‌ఫెక్షన్లు, పోషకాహార లోపం రాకుండా రక్షణ కవచంగా పనిచేస్తుందని తెలిపారు.అలాగే శిశువుకు వ్యాధి నిరోధకతను పెంచుతుందని తెలిపారు. ముఖ్యంగా పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి తల్లిపాలు అవసరమని సీడీపీఓ నిర్మల తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, బాలింతలు, గర్భిణిలు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి భవనాల పరిశీలన



కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త కేంద్రీయ విద్యాలయ అధికారులు మంగళవారం ద్రవిడ వర్సిటీలో పర్యటించారు. వర్సిటీలో ఉన్న భవనాలు కేంద్రీయ విద్యాలయ ప్రారంభం కోసం వినియోగించుకునే నిమిత్తం వారు భవనాలను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయాన్ని కుప్పం మండలంలో నిర్మించను న్నారు. అప్పటివరకు విద్యాలయ నిర్వహణకోసం ద్రవిడ వర్సిటీ భవనాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, ద్రవిడ వర్సిటీ విసి ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి

– అర్బన్ సిఐ జి.టి. నాయుడు

కుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త



విద్యార్థులు దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని అర్బన్ సిఐ జి.టి.నాయుడు సూచించారు. మంగళవారం స్థానిక ఎంఎఫ్‌సి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తుకు బానిసలు కారాదని సూచించారు. అలాగే సహచర విద్యార్థులను ర్యాగింగ్ చేయడం వంటి దుశ్చర్యలు మానుకోవాలన్నారు. ద్విచక్రవాహనాలు లైసెన్సులు లేకుండా నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర వేళల్లో 100,112లకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ల వాసుదేవరెడ్డి, రామకృష్ణమనాయుడు, అధ్యాపకులు సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువు దురాక్రమణలు వెంటనే తొలగించాలి

కడ పిడి వికాస్ మర్మత్

శాంతిపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త

మండలంలోని శివరాంపురం పంచాయతీ నంజంపేట దాఖలు సర్వే నెం 28/1లో 35.70 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న బొమ్మగంటి చెరువులో వెంటనే ఆక్రమణలు తొలగించాలని కడ పి.డి. వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. సోమవారం చెరువు దురాక్రమణపై గ్రామస్తులు పి.డి.కి ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఉదయం పి.డి. వికాస్ మర్మత్ సంఘటనా స్థలికి చేరుకుని చెరువును పరిశీలించారు. కార్యక్రమంలో డిటి కౌలేష్, సర్వేయర్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

చిత్తూరురూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:



చిత్తూరు పట్టణం, పివికెయస్ ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాల నందు జెకెసి, సెట్విన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్సనల్ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్‌జ్యోతి తెలిపారు.ప్రధానవక్తగాపాల్గొన్నకౌటిల్యా బ్యాంక్ కోచింగ్ సంస్థ ఎన్ఎస్ రెడ్డి విద్యార్థులకు ఏయే కోర్సులకు ఏయే ఉద్యోగ అవకాశాలున్నాయో, వివిధ పోటీపరీక్షలకు ఎలాంటి మార్గాలలో చదవాలో, నిరంతరం విశ్లేషణాత్మక అధ్యయనం చేస్తే ఎంతటి స్థాయి ఉద్యోగానైనా సాధించవచ్చుననీ తదితర విషయాల గురించి స్ఫూర్తిదాయక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, జెకెసి డా.ఎన్.బాబులు సమన్వయకర్తలుగా వ్యవహరించగా కళాశాల అధ్యాపకులు డా. ఎస్.శరవణ, ఎస్.సుభాషిణి, ముజకర్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగం సమస్యలపై ధర్నా

చిత్తూరురూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఆదేశాల మేరకు కిసాన్ మోర్చా మార్కెట్‌యార్డు రాష్ట్ర కన్వీనర్ యువరాజు ఆధ్వర్యంలో భాజపా నాయకులు జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిననంతరం డిఆర్‌వోకు వినతి పత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా నాయకులు ప్రభాకర్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, రాష్ట్ర, జిల్లానాయకులు చినరాజులు, బాబు, రవికుమార్, మోహన్‌నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, నారాయణస్వామిరెడ్డి, దొరబాబుగౌడ్, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కమిటీల నియామకాల్లో రాజకీయాలొద్దు : గువ్వల

చౌడేపల్లి, ఆగస్టు 6 ప్రభాతవార్త



పాఠశాల యాజమాన్య కమిటీ నియామకాల్లో రాజకీ యాలకు తావివ్వరాదని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. స్థానిక పరిపాలనా భవనంలో మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌బాబులు రాష్ట్ర విద్యాభి వృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. పాఠశాలలు, విద్యాభివృద్ధి కోసం పాటుపడేవారికి యాజమాన్య కమిటీల్లో అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. తేదేపా యువనేత మాదిరాజు ప్రదీప్‌రాజు, శ్రీధర్‌రాజు(గిరి), రెడ్డిప్రసాద్, అర్జున్, ఎంఇఓ కేశవరెడ్డి, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## ప్రజాకవి గద్దర్‌కి నివాళులు

పాకాల, ఆగస్టు 6, ప్రభాతవార్త



గద్దర్ సంస్కరణ సభ మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం మండల విద్యాశాఖాధికారి బాబ్జి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గద్దర్‌గా అందరికీ సుపరిచితమైన గుమ్మడి విఠల్ రావు గొప్ప విప్లవ కవి. ఈయనకు గద్దర్‌అను పేరు బ్రిటీష్ రాజ్యాన్ని వ్యతిరేకించిన గద్దర్ పార్టీకు గుర్తుగా తీసుకోవడం జరిగిందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. భావ వ్యాప్తి కోసం ఆయన ఊరూరు తిరిగి ప్రచారం చేసాడని దీని కొరకు ఆయన బుర్రకథను ఎంచుకున్నాడు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్ అదే ఆయన పేరుగా స్థిరపడింది. పల్లెల్లో జరుగుతున్న అకృత్యాలను ఎదురించేందుకు జన నాట్య మండలి ఏర్పాటు చేసి దళితులను మేల్కొల్పి వారిలో చైతన్య పరిచారు. అనేక సినిమాల్లో కూడా గద్దర్ పాటలు రాసి ఆయనే పాడి ఆడాడు. ఈయన మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో కూడా ప్రదర్శనలు చేసారు. అనంతరం గద్దర్ ఫోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అంగన్‌వాడీల పనితీరును మెరుగుపరుచుకోవాలి

– ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త



అంగన్‌వాడీల పనితీరును మెరుగుపరుచుకుని కేంద్రాలకు వచ్చే పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో రోజురోజుకి పిల్లలు రావడం తగ్గుతుందని, దీనిపై సంబంధిత ఆయాలు, అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె కోరారు. ప్రభుత్వం బాలింతలకు, తల్లులకు, పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు అన్నిరకాల నిధులను సమకూరుస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, తల్లులకు, బాలింతలకు పెట్టే ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు.టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, మాధవనాయుడు, ఎస్ఎన్ మునిరాజా, సిడిపిఓ శారదాంబ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. సాయంత్రం 3.30 గంటల వరకు ఎండవేడి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీరు రోడ్లపై వరదలా పారా యి. రైల్వేఫీడర్స్ రోడ్డు, గమండ్లవీధి, బాపూజీ కాలనీ, రాఘవయ్యపేట, సాయినగర్ ప్రాంతాలతో పాటు పట్టణంలోని ప్రధాన మార్గమైన ఆర్‌అండ్‌బి రోడ్డు పూర్తిగా జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో పంటలకు కొంతమేరకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది.

## త్రివిధ దళాల్లో ప్రవేశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం త్రివిధ దళాలలో ప్రవేశంపై భారత నావికాదళం అధికారి, లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావు అవగాహన సదస్సు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రంలోని అరకోణం నుంచి భారత నావికాదళం అధికారి, లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావు తన 20 మంది సభ్యులతో సైక్లింగ్ ఎక్స్‌పెడేషన్ కార్యక్రమాన్ని చెన్నై నుంచి విశాఖపట్నం వరకు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా వారు ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు, ఎన్‌సీసీ క్యాడెట్లకు త్రివిధ దళాల్లోని జీవన విధానం, ఇండియన్ నేవీ నేవీలో చేరడానికి గల అవకాశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సీసీ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను వివరించి, ఎన్‌సీసీ విద్యార్థులను, ఏఎన్‌ఓలను అభినందించారు. లెఫ్టినెంట్ కమాండర్ పరీక్షిత్‌రావుకి కళాశాల తరపున జ్ఞాపికను బహూకరించారు.10 ఆంధ్రా నావెల్ యూనిట్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గోదంగావే ఆదేశాల మేరకు ఎన్‌బీకేఆర్ ఎస్టీ నావెల్ యూనిట్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. లెఫ్టినెంట్ జి.మాధవయ్య, ఉమెన్‌కేర్ టేకర్ కె.శోభారాణి, అసిస్టెంట్ పీడీ రాముకుమార్ పాల్గొన్నారు.

## మద్దాలికండ్రిగలో తల్లిపాల వారోత్సవాలు

కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త

కోట మండలం మద్దాలికండ్రిగలో మంగళవారం సిడిపిఓ మునికుమారి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మునికుమారి మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కొందరు తల్లులు అవగాహన లేకపోవడంతో పిల్లలకు డబ్బాపాలు పడుతున్నారని చెప్పారు. భవిష్యత్‌లో ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండాలంటే తన బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## అక్రమ లేఅవుట్ తొలగించిన అధికారులు

–నష్టపోయిన ప్లాట్ల కొనుగోలు దారులు

వెంకటగిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త

పట్టణంలోని చెవిరెడ్డిపల్లి చెరువును ఆక్రమించి అక్రమంగా వేసిన లేఔట్లను నీటిపారుదల శాఖ అధికారులు తొలగించారు. చెరువు హద్దుల కొరకు ట్రేంచింగ్‌ను ఏర్పాటు చేశారు. అక్రమ లేఔట్‌లో ప్లాట్లు కొన్న వారు నష్టపోయామని ఆవేదన చెందారు. లేఔట్‌లో వేసిన ప్లాట్‌లను యజమాని అమ్మి సొమ్ము చేసుకున్నాడు. చెవిరెడ్డిపల్లి చెరువు 39 ఎకరాల విస్తీర్ణం ఉంది. చెరువు చుట్టూ కొందరు ఆక్రమించి గోడలు నిర్మించారు. చెరువులో ఉన్న ఆకరణాలను నీటిపారుదల శాఖ అధికారులు జేసిబి పెట్టి తవ్వారు. హద్దు గోడలను తొలగించారు. నీటిపారుదల శాఖ ఏఈ బాబు రావు, సిబ్బంది పర్యవేక్షణలో ఆక్రమాలలో తొలగించారు. ప్లాట్లు కొన్న వారు మా స్థలాలు పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్న చెరువులకు హద్దులను ఏర్పాటు చేస్తామని అధికారులు అంటున్నారు. మొత్తం మీద చెరువుల ఆక్రమాల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు

## హాస్టల్లో పరిశుభ్రత పాటించాలి

తహశీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద్

బాలాయపల్లి, ఆగస్టు 6, ప్రభాతవార్త



హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించాలని తహశీల్దార్ కెవిఆర్‌వి ప్రసాద్ రావు సిబ్బందిని ఆదేశించారు. వెంగమాంబపురం గ్రామంలోని బిసి బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్‌లో వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బాత్రూంలకు తులుపులు లేవని ఇబ్బందిగా ఉందని విద్యార్థులు తహశీల్దార్‌కు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ శిరీష, ఆర్ఐ పూర్ణచంద్ర రావు ఉన్నారు.

## తహశీల్దార్ మునిలక్ష్మిని కలిసిన ఎంపిపి తనుజ రెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త



నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ మునిలక్ష్మిని ఎంపిపి తమ్మిరెడ్డి తనుజ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, శివారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తహశీల్దార్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. మండలంలో ఉన్న భూ సమస్యలను తహశీల్దార్ దృష్టికి ఎంపిపి, నాయకులు తీసుకుని వెళ్లారు. సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

## అన్నా క్యాంటీన్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

ఈఈ దేవిక

వెంకటగిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త



అన్న క్యాంటీన్ పనులను పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దేవిక అధికారులను ఆదేశించారు. స్థానిక అన్న క్యాంటీన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ నెల 15వ తేది క్యాంటీన్ ప్రారంభిం చాల్సి ఉందని పదోతరగతి నాటికి పనులను పూర్తి చేయాలని సూచించారు.పనుల్లోనాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆమె ఆదేశించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## హోరాహోరీగా చిత్తూరు- అనంతపురం జట్ల మధ్య క్రికెట్ పోటీలు

వెంకటగిరి, ఆగస్టు 6, ప్రభాతవార్త



స్థానిక తారకరామా క్రీడా ప్రాంగణంలో చిత్తూరు అనంతపురం టీంల మధ్య క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. చిత్తూరు జట్టు 467కు 10 మంది అవుట్ అయ్యారు. అనంతపురం గట్టుకు చెందిన రాజ్ కుళ్లాయప్ప రాజ్ 95 రన్స్ చేశారు. హోరాహోరీగా పోటీలు జరుగుతున్నాయి.

## దక్కిలి తహసిల్దార్‌గా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

దక్కిలి, ఆగస్టు 6 ప్రభాతవార్తః



దక్కిలి మండల తహసీల్దార్‌గా ఎం.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. రెవిన్యూ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు.

## తడలో మండల స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటు

తడ, ఆగస్టు 6 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు తడ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి మండల స్థాయి కాల్‌సెంటర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు సంబంధించిన సమస్యలు తెలియజేసేందుకు ఈ కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని ఎంపిడిఓ విజయకుమార్ తెలిపారు. తడలో డి.వరుణ్, వి.విష్ణులకు ఈ బాధ్యతలు అప్పగించామని, తెలియజేస్తే పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడతారని ఎంపిడిఓ చెప్పారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటండి

చిల్లకూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త



చిల్లకూరు పంచాయితీలోని దర్గా వద్ద పెళ్లకూరు మండలం పెళ్లకూరు గ్రామానికి చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా మంగళవారం ఐదు వేల మామిడి పండ్ల మొక్కలను ఉచితంగా ట్రస్ట్ సిఈవో సీతారామ నాయుడు, ఏవో కృష్ణ గళ్ళ, గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీల చేతులు మీదుగా గ్రామస్థులకు పంపిణీ చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. అదే విధంగా మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ స్వచ్ఛంగా లభిస్తుందని ఆహార లభ్యత భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. నేలకు కోతకు గురి కాకుండా ఉంటుందన్నారు. ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు ఎంతోమందికి సేవ కార్యక్రమాలు చేయడమే ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ గౌరీ శంకర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, పెనుబోలు జానకిరామ్ రెడ్డి, కొండా రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ

గూడూరు, ఆగస్టు 6, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలును ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా చేతుల మీదుగా పంపిణీ చేశారు. కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ నూతనంగా ఏర్పాటు చేసుకున్న సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు ట్రస్టు సభ్యులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ షరీనా మాట్లాడుతూ ట్రస్టు తరుపున పేదలకు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్నలు పొందాలని భవిష్యత్తులో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అభివృద్ధి పథంలో నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ పెరిమేటి చెంచయ్య, ట్రెజరర్ దోనుపర్తి, దామోదర్ రావు, సభ్యులు ఎస్‌కె రఫీ, అత్తిమంజేర్ గోపాల్, చవలా సురేంద్ర బాబు, పిఎన్ఎం, నరసింహులు, హాస్పిటల్ సిబ్బంది సాయి, తదితరులు పాల్గొన్నారు.

## జైన్ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త



రాజస్తాన్ సేవాసంఘం సూళ్లూరుపేట, చెన్నై మెట్రో మహావీర్ క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర అరవింద ఐ ఆసుపత్రి వారి సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పట్టణంలోని జైన్ ప్రార్ధన మందిరంలో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులను పరీక్షించి 196 మందికి ఉచితంగా నేత్ర వైద్య శస్త్రచికిత్సలు చేసేందుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి భగవాన్‌రావు, బాలాజీ, బద్రినాథ్‌కదం దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సోహన్‌రాజ్ బండారి, సురేంద్రకుమార్, ప్రదీప్‌కుమార్, నరేంద్ర జైన్ తదితరులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో వర్షం

దొరవారిసత్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త;

మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఓమోస్తారు వర్షం కురిసింది. ఈ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి భానుడు భగభగ మంటూ మండుతూ ఉండి సాయంత్ర సమయంలో ఒక్కసారిగా ఆకాశంలో నల్లటికారుమబ్బులు కమ్ముకొని ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గ్రామాల్లో వీధులు బురదమయంగా మారుతున్నాయి ఎడగారుసాగు చేపట్టిన రైతులకు వర్షాలు కొంతవరకు ఊరటనిస్తుంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

# సిపిఆర్ పైన శిక్షణ కార్యక్రమం

తిరుపతి విద్య, ఆగస్టు 6, ప్రభాతవార్త




శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం నర్సింగ్ కాలేజీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజ్ నందు మంగళవారం విద్యార్థులకి సిపిఆర్ పైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ సిపిఆర్ విధానాన్ని వివరిస్తూ, వ్యక్తి యొక్క గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరితిత్తులు శ్వాస తీసుకొని స్థితిలో ఉన్నప్పుడు వాటిని పునరుద్ధరణకు చేసే అత్యవసర ప్రక్రియని సిపిఆర్ అంటారని, కాకపోతే దీనిని ఒక ప్రత్యేక పద్ధతిలో చేయాలని సూచించారు. ఈ పద్దతులను వివరిస్తూ, స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి యొక్క పరిసరాలను ముందుగా గమనించి సురక్షితమైన చదునైన ప్రాంతానికి తరలించి, స్పృహ కోల్పోయిన వ్యక్తి రెండు భుజాలను పట్టుకుని ఊపుతూ లేపే ప్రయత్నం చేయాలి. అప్పటికీ లేవకపోతే, గొంతు దగ్గర చేతి వేళ్లతో పల్స్ కోసం చూడాలి. కదలికలను శ్వాసను గమనించి, ఎలాంటి స్పందనా లేని యెడల మరొక వ్యక్తిని సహాయానికై పిలిచి, అంబులెన్స్‌కి కాల్ చేయమని చెప్పి తను సిపిఆర్ మొదలు పెట్టాలని వివరించారు. నిమిషానికి 100 – 120 సార్లు ఛాతి మీద ఇంచెలు లోపలికి వెళ్లి వచ్చేలాగా ఈ వత్తిదులను ఇవ్వాలని డెమానిస్ట్రేషన్ ద్వారా వివరించి, విద్యార్థులతో మనిక్యూన్ ద్వారా ప్రాక్టీసు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన విభాగ ఇన్చార్జి హెడ్ డా. నీరజ, ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ పరమేశ్వర్, నర్సింగ్ కాలేజీ అధ్యాపకులు ముని చంద్రిక, జోష్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్కెట్‌లోకి నిస్సాన్ ఎక్స్‌ట్రైల్ కార్ విడుదల

తిరుపతి విద్య, ఆగస్టు 6, ప్రభాతవార్త



రేణిగుంట రోడ్డులో గల హైటెక్ నిస్సాన్ షో రూమ్‌లో మంగళవారం సాయంత్రం నిస్సాన్ ఎక్స్‌ట్రైల్ నూతన కారును ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మేనేజింగ్ డైరెక్టర్ సి. జగన్నాథరెడ్డి, డైరెక్టర్స్ చేరుకు నిరంజన్, సి. భారతి, సి. హూషిమాతో పాటు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథ రెడ్డి మాట్లాడుతూ నిస్సాన్ ఎక్స్‌ట్రైల్ వెహికల్ నందు అత్యధిక ఫీచర్స్ కలిగి ఉన్నాయని తెలిపారు. ఇందులో వీసీ టర్బో ఇంజన్, 360 డిగ్రీస్ కెమెరా, ఫోనో రామిక్ ఎలక్ట్రికల్ సన్రూఫ్, సెవెన్ ఎయిర్ బ్యాగ్స్ ఆల్ వీల్ డిస్క్ బ్రేక్స్‌తో ఉన్నాయని తెలిపారు. షారూం ప్రైస్ 49 లక్షల 92000 ఉందని అన్నారు. వెహికల్ బుకింగ్ కొరకు 9000454634ను సంప్రదించగలరని తెలిపారు. ఈ కార్యక్రమానికి షోరూం జనరల్ మేనేజర్ ఎన్‌విఎస్ శాస్త్రి, నిస్సాన్ రీజనల్ సేల్స్ మేనేజర్ జివి ఆనంద్, ఇతర ఇబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి రాజేంద్రుడుకు మాస్టర్ ట్రైనర్‌గా అవకాశం

తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవర్తా



ఎస్వీఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సంక్రాంతి రాజేంద్రుడుకు ఎపిసిసిఈ యునెస్కో ఎంజిఐఈపిలు సంయుక్తంగా డిగ్రీ విద్యార్థులకు సోషల్ డెవలప్‌మెంట్ స్కిల్స్ పేపర్ 1 సర్టిఫికెట్ కోర్సుపై సీక్ సెల్ శిక్షణ కార్యక్రమాన్ని చిత్తూరులోని పివికెఎన్ డిగ్రీ కళాశాలలో ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు తిరుపతి చిత్తూరు జిల్లా ఎంపికైన డిగ్రీ కళాశాల అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐదురోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంకు శ్రీకాళహస్తి ఎస్వీఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అద్యాపకులు సంక్రాంతి రాజేంద్రుడు మరియు డాక్టర్ మునెయ్యకు మాస్టర్ ట్రైనర్స్‌గా అవకాశం లభించింది ఈసందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ వర్మలతో పాటు పలువురు అధ్యాపకులు ఇద్దరిని అభినందించారు.

# తల్లిపాలే బిడ్డకు రోగనిరోధక శక్తిని అందిస్తాయి

తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త



ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఉషారాణి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జ్ఞానమ్మకండ్రిగ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, గర్భిణీస్త్రీలు, బాలింతలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ శాంతిదుర్గ ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని కాపాడుదామని తెలిపారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని రెండు సంవత్సరాలు వరకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం గర్భిణీస్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి పసుపు, కుంకుమ అందించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ నాగమణి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణవాసుదేవరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుభాషిణి, గీత, మణిశ్రీ,రేవతి, మాధవి, పద్మ, సహాయకురాలు రమణమ్మ తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్లు, ఎస్పీలతో సిఎం భేటీ హర్షణీయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాన్ని నిర్వహించడం హర్షణీయమని రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారిగురవారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తొలిభేటీ కావడం గమనార్హం. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాల్లో జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలన్నీ విధ్వంసం చేశారనడానికి నిదర్శనమే కలెక్టర్లు, ఎస్పీల సమావేశం ఉద్దేశ్యమన్నారు. సైకో పాలన వచ్చిన తర్వాత వచ్చిన ఏడు రోజులకే ప్రజావేదికను కూల్చివేసి విధ్వంసకర పరిపాలనకు నాంది పలకడం జరిగిందని ఇలాంటి విధ్వంసకర పాలనలో అమరావతి, పోలవరం ధ్వంసం చేయడంతో రాష్ట్రాభివృద్ధి 30ఏళ్ళు వెనక్కి పంపారన్నారు.

# తెదేపా కార్యకర్త భౌతికకాయానికి ఎమ్మెల్యే నివాళి

సత్యవేడు, ఆగస్టు 6, ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలోని దళవాయి అగ్రహారంకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బాలాజీ మంగళవారం మృతిచెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కార్యకర్త మృతదేహానికి నివాళి అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.బాలాజీ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే భరోషా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు భాష, బాలరాజు, చిన్న, గణేష్,శశిలు ఉన్నారు.

# రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త



రాష్ట్రీయ సేవా సమతి(రాస్) మరియు టాటా ట్రస్టు సౌజన్యంతో మంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరాన్ని చిందేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈశిబిరానికి విశేషమైన స్పందన లభించింది. కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకర్ ప్రారంభించి మాట్లాడుతూ మనిషి జీవితం నేడు పని ఒత్తిడి, పనిభారంతో యాంత్రికంగా మారడం వల్ల తన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యంగా చూడడం, వ్యాధిముదిరితే తప్ప ఆస్పత్రిలకు వెళ్ళలేని పరిస్థితుల్లో ఉన్నారని తొలుత మన ఆరోగ్యం బాగుంటే కుటుంబం ఆనందంగా అభివృద్ధి చెందుతుందని తెలుసుకోవాలని తెలిపారు. రాస్ ద్వారా అందించే అన్ని కార్యక్రమాలను పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలందరు తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డాక్టర్ వెంకయ్య బాబు మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి గుండెజబ్బుల తర్వాత అత్యధికంగా ఇబ్బందిపెడుతున్న వ్యాధి అని దీన్ని ఆదిలోనే గుర్తించకపోతే పలు సమస్యలకు గురికావాల్సి ఉంటుందన్నారు. అనంతరం మహిళలకు, పురుషులకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లకు సంబందించి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు డాక్టర్ వెంకయ్యబాబు బృందం, హేమంత్‌కుమార్, రెడ్డికుమారి, మెహతాజ్ , మహేంద్ర, రాస్ సిబ్బందివినోద్,జయలలిత,రాజశేఖర్,పొదుపు సంఘాల సభ్యులు లీడర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మండల సమావేశం అలా ముగించేశారు

రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త

రామకుప్పం మండల సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఎంపిపి సుబ్రమణ్యం అధ్యక్షతన సమావేశం జరగ్గా ఏడుమంది ఎంపిటిసిలు, ఆరుమంది సర్పంచులు, అధికారులు హాజరయ్యారు. 23 పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వీధిదీపాలు, డ్రైను , తాగునీటి వసతి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎంపిపి కోరారు. ముద్దనపల్లి, చిక్కపల్లి తాండాల్లో బోరు లేకపోవడంతో ప్రజలు వ్యవసాయ పొలాలనుంచి నీరు తెచ్చుకుంటున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాలని సభ్యులు కోరారు. సమావేశంలో ఎంపిడిఒ ఈశ్వరయ్య, డిటి దిలీప్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపిపి

పెద్దపంజాణి, ఆగస్టు 6 ప్రభాతవార్త

మండలంలోని బసవరాజు కండ్రిగ గ్రామానికి చెందిన వెంకటరమణ కుటుంబాన్ని మంగళవారం మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి పరామర్శించారు. వెంకటరమణ కుమారుడు సాయికిరణ్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో ఆయన గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటు ంబీకులకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ధనుంజయ పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీల్లో కాండర్ స్కూల్ విద్యార్థులు

## అండర్ 11 బాలురు "చిరాగ్, నిహాల్ రెడ్డి" బంగారు పతకం బాలికల విభాగంలో యోషిత కాంస్యం : ప్రిన్సిపాల్ నాగశ్వేత

చంద్రగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:



రాష్ట్ర స్థాయి 6వ రోల్ బాల్ పోటీలలో ఐతేపల్లి సమీపంలోని కాండూర్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ నాగశ్వేత తెలిపారు. జులై 27, 28న వైజాగ్‌లో రాష్ట్ర స్థాయి రోల్ బాల్ పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. అండర్ 11 బాలుర విభాగంలో చంద్రగిరి పాతపేట చెందిన సంగీత జీవన్‌కృష్ణ దంపతుల కుమారుడు చిరాగ్ కృష్ణ, మాదవి హరి దంపతుల కుమారుడు నిహాల్ రెడ్డి తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా బాలికల విభాగంలో యోషిత తన అద్వితీయ ప్రతిభతో కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో పురుషోత్తం, లలిత్, మర్వాన్, హరీష్, హేత్విక్ తమ ప్రతిభాపాఠవాలతో రజత పతకం సాధించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె క్రీడాకారులను, కోచ్ కార్తీక్‌ను సన్మానించి అభినందించారు. విజేతలు త్వరలో జరగబోయే సౌత్ ఇండియా, నేషనల్ పోటీలలో పాల్గొంటారని కోచ్ కార్తీక్ వెళ్ళడించారు.

# మహాభారత మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ పాతకాల్వ గ్రామంలో ఈనెల 7వ తేదీ నుండి 18వ తేదీ వరకు శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి 32వ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనునట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. శ్రీద్రౌపది సమేత ధర్మరాజుల స్వామి మహాభారత మహోత్సవ ఆహ్వాన పత్రిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవిష్కరించారు. సాధారణంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల మధ్యలో మహాభారత ఉత్సవాలను నిర్వహిస్తూ ఉంటారు. తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామ పంచాయతీలో బుధవారం సాయంత్రం ధనస్సు లగ్నంలో 6గంటల నుండి 6:30గంటలలోగా ధర్మరాజుల స్వామి ధ్వజారోహణము జరుగునని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 1:30 గంటల నుండి సాయంత్రం 5:30గంటల వరకు హరికథ చెప్పబడునని తెలిపారు. 8న భీష్మ ప్రతిజ్ఞ, 9న పాండవ జననం, 10న హిడింబాసురవధ, 11న ద్రౌపది స్వయంవరం, 12న సుభద్ర కళ్యాణం, 13న రాజసూయ యాగం, 14న ద్రౌపది మాన సంరక్షణ, 15న అరణ్య పర్వం, 16న శ్రీకృష్ణ రాయభారము, 17న పద్మవ్యూహం, 18న కర్ణ మోక్షం, దుర్యోధన వధ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు.

# ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల్ బాడ్మింటన్ జిల్లా జట్లు ఎంపిక

తిరుపతి క్రీడ, ఆగస్టు 6, ప్రభాతవార్త

ఈ నెల 11వ తేదిన ఉదయం 8 గంటలకు శ్రీ కాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల గ్రౌండ్ ఆవరణ నందు ఉమ్మడి చిత్తూరు జిల్లా సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ స్త్రీ, పురుషులు జట్లు సెలక్షన్ జరగబడును. సబ్ జూనియర్స్ 2 జనవరి 2009 తరఉవాత జన్మించి ఉండాలని జూనియర్స్ 2 జనవరి 2005 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఈ సెలక్షన్స్ వచ్చి క్రీడాకారులు తమ యొక్క ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకురావాలని, డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ ఎంపిక చేసిన జట్లను సబ్ జూనియర్స్ అన్నవనం, జూనియర్స్ విశాఖపట్నం, సీనియర్స్ నంద్యాలలో జరుగు రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లకు పంపించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంకు చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చైర్మన్ జగన్నాథం నాయుడు, ప్రెసిడెంట్ వెంకటస్వామి, అసోసియేషన్ సభ్యులు సీనియర్ క్రీడాకారులు పాల్గొంటారని, చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సెక్రటరీ పి. బాలాజీ తెలిపారు. మరిన్ని వివరాలకు 7013754776, 9052860009 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

# తండ్రి హయాంలో జన్మభూమితో సింగారాలు:

## నేడు ప్రత్యేక నిధుల కోసం ప్రయత్నాలు, చెరువులకు పూర్వ వైభవం

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పురాతన కాలం నాటి చెరువులకు పూర్వ వైభవం తీసుకురావటానికి యువ నాయకుడు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని సీనియర్ తెలుగుదేశం నాయకుడు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంపేడు పంచాయతీలోని వెంగన్నగుంట చెరువులో వైకాపా నాయకులు ఆక్రమించిన ఆక్రమణలను అధికారులు సహకారంతో తొలగించినట్లు వివరించారు.ఎండనక,వాననక,ఆరుగాలం శ్రమించి పంటలు పండించి ప్రజల ఆకలి తీర్చుటకు సాగునీటి అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మంత్రిగా ఉన్నపుడు శ్రీకృష్ణదేవరాయాల కాలం నాటి చెరువులకు జన్మభూమి ద్వారా మహర్దశ కల్పించారు. కానీ గత ఐదేళ్లలో పాలకులు ఎక్కడ చెరువులో ఖాళీ ఉన్నా కాలువ పొరంబోకులు కనబడినా ఆక్రమించుకున్నారని ఆరోపించారు.దాంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కానీ తమ బాధలను చెప్పుకోవటానికి అవకాశం లేకుండా పరిపాలన సాగిందన్నారు.తమ బాధలను చెబితే కేసులు పెట్టి భయభ్రాంతుల్ని చేసి పరిపాలించారన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ, ఇరిగేషన్ అధికార యంత్రాంగం కదిలిందన్నారు. వైకాపా నేతల చెరలో ఉన్న కాలువలు, ఒరవ కాలువలు,చెరువులు, కుంటలకు చెర తొలగించుటకు కృషి చేస్తున్నారన్నారు.వైకాపా ప్రభుత్వ హయాంలో సాగించిన అక్రమ ఆక్రమణల పర్వాన్ని సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈశ్వరరెడ్డి వివరించారు.

# శివయ్య సేవలో తణుకు ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,ఆగస్టు 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు సన్నిధిలో మంగళవారం తణుకు శాసనసభ్యులు స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. తణుకు శాసనసభ్యులు అరిమిల్లి రాధాకృష్ణ మంగళవారం కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చారు.వారికి ఎసి మల్లికార్జున్ ప్రసాద్ దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు, స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

# సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులుగా తోటకూర

శ్రీకాళహస్తిరూరల్,ఆగస్టు 6 ప్రభాతవార్త



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడుగా ఏర్పేడు మండలం తొటకూర కోటేశ్వర రావును ఎన్నుకున్నారు.ఈ మేరకు మంగళవారం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పలు సమస్యలతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలానికి చెందిన తోటకూర కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకునే ప్రతి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగులుగా ఎప్పుడూ ముందు ఉండి విజయవంతంగా పూర్తి చేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువస్తామన్నారు.గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న విన్నవించినట్లు కోటేశ్వరరావు వివరించారు.ప్రత్యేక కమిటి ఏర్పాటు చేసి పరిష్కరించాలని కోరారు

# బాధ్యతతో పనిచేయకపోతే చర్యలు తప్పవు

## – తహశీల్దార్ మధుసూధనరావు

తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరు బాధ్యతతో పనిచేయాలని లేకుంటే చర్యలు తప్పవని తొట్టంబేడు మండల తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలుస్వీకరించిన యు.మధుసూధనరావు సిబ్బందికి తెలిపారు. ఈసందర్భంగా ఆయన తొలుత సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం సమావేశాన్ని నిర్వహించి గతంలో తాను కూడా తొట్టంబేడు మండలంలో డిప్యుటీ తహశీల్దార్‌గా పనిచేశానని ఇక్కడ పనిచేసిన అనంతరం పదోన్నతిపై వడమాలపేట, పిచ్చాటూరు మండలాల్లో పనిచేసి ఎన్నికల విధుల నిర్వహణలో బద్వేలుకు బదిలీ అయి ప్రస్తుతం తొట్టంబేడు తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. కాగా పదవీ విరమణ పొందిన సీనియర్ విఆర్ఓ మురళీనాయుడు నూతన తహశీల్దార్‌ను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు.

# గ్రామాల్లో ఉపాధిహామీ పనుల పరిశీలన

.తొట్టంబేడు, ఆగస్టు 6 ప్రభాతవార్త



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా వలసలను నివారించేందుకు కేంద్రప్రభుత్వం ఈపథకాన్ని రూపొందించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మంగళవారం తొట్టంబేడు గ్రామ పంచాయతీలో జరుగుతున్న జాతీయగ్రామీణ ఉపాధిహామీ పనులను ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ పరిధిలో జరుగుతున్న నీటి నిల్వకుంట పనులను పరిశీలించి ఉపాధిహామీ పనులను చేస్తున్న వారితో మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు పూర్తిచేసిన కూలీలకు ప్రభుత్వం అందించే కూలీని రోజుకు రూ.300లు పొందవచ్చని దీన్ని వారి ఖాతాలో జమచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ప్రతి కుటుంబం వందరోజులు పనిదినాలు కల్పించాలన్నారు. క్షేత్రసహాయకులు మరియు సిబ్బంది కలిసి గ్రామాల్లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు ఎక్కువగా ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుని పనులు చేయాలన్నారు. ఎంపిడిఓతో పాటు ఈఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, ఉపాధిహామీ క్షేత్ర సహాయకుడు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

# రాజ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, ఆగస్టు 6 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని రాజ్‌కుమార్, నారాయణ కుటుంబాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళ వారం వారి పార్థీవ దేహానికి పూలమాల వేసి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడు తూ రాజ్‌కుమార్ నారాయణ మృతి చెందటం టిడిపి పార్టీకి తీరనిలోటు అన్నారు.మృతి చెందిన కుటుం బానికి ప్రభుత్వం నుంచి రావలసి సహాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి విజయకుమార్,నాయకులు భాస్కర్,పరదేశి,ప్రశాంత్, దేవనేషన్, కోటీశ్వర రావు,పాల్గొన్నారు.

# ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతి

నగరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:

ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని నగరి అంబేద్కర్ సర్కిల్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి డి.గోవిందస్వామి, నగరి మండల కార్యదర్శి బాలవర్ధన్‌రాజు, అంబేద్కర్ సంఘం నాయకులు సురేష్‌కుమార్, కిరణ్‌కుమార్, బాలకృష్ణ, తంగరాజు, సీపీఐ విద్యార్థి నాయకుడు విజయ్ పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం - ఎమ్మెల్యే



**నగరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం నగరి డిగ్రీ కళాశాల మైదానంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టిక ఆహారాన్ని అధికారులతో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని వారికి అందజేయాలని కోరారు. సమయపాలన పాటిస్తూ అంగన్‌వాడీ కార్యాలయాలను తెరిచి కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత పిల్లల చూసుకోవడంతో పాటు, కేంద్రాల్లో ఉన్నంత సేపు సంరక్షణకు ఎంతో బాధ్యతగా ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పరిష్కారం మార్గం చూపుతానని అంగన్‌వాడీ కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడంలో తల్లులకు ఉన్న అపోహలను విడిచిపెట్టాలన్నారు. యూపీహెచ్‌సీ వైద్యులు డా. ఎయిల్ అరసన్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డలకు చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, మీర, స్థానిక టీడీపీ నాయకులు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, సీడీపీవో కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు,ఆశలు,నగరి,నింద్ర,విజయపురంమండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

పిచ్చాటూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:



పిచ్చాటూరు ఇందిరానగర్‌లో మృతి చెందిన టీడీపీ నేత ఏసు మాతృమూర్తి కృష్ణమ్మ సోమవారం పరమపదించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఉదయం స్థానిక టీడీపీ నేతలు ఇళంగోవన్‌రెడ్డి, తిరుమల రెడ్డిలతో కలసి పిచ్చాటూరు ఇందిరానగర్‌కు చేరుకుని టీడీపీ నేత ఏసు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# శ్రీవారి సేవలో ఎంఎల్‌సి శ్రీకాంత్

తిరుమల,ఆగస్ట్6 ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం ఉదయం ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ కుటుంబంతో కలసి దర్శించుకున్నారు. దర్శనానంతరం టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# మళ్లీ తెరపైకి పంపు షెడ్డు పంచాయతీ - సేమ్ సీన్ రిపీట్

రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త:



మళ్లీ రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సుబ్బరాయులు పంపు సెట్టు స్థల వివాద పంచాయతీ తెరపైకి వచ్చింది. ఈ పర్యాయం కూడా డీఎల్‌పీవో ప్రభురెడ్డి విచారణ కోసం వచ్చారు. పంపు సెట్టు స్థల వివాదంతో పాటు రేణిగుంట 1వ వార్డు మెంబరు విజయలక్ష్మి భర్త జగన్ ప్రజా సమస్య పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్జీ సమర్పించినందుకు ప్రభురెడ్డి విచారణకు వచ్చినట్లు తెలిపారు. అయితే ఫిర్యాదు దారుడు రాకపోవడంతో విచారించలేకపోతున్నామని పాత్రికేయులతో అన్నారు. ఇదిలా ఉంచితే సుబ్బరాయుడు బోరు స్థలం ఆక్రమణకు గురైన విషయంపై విలేకరులు ప్రశ్నించగా విచారణ జరపాల్సిందిగా ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రస్తుత ఈవోపీఆర్‌డీ సుబ్బరత్నమ్మను ఆదేశించామన్నారు. శాఖాపరమైన చర్యలు చేపట్టి లీగల్ నోటీసులు జారీ చేయాలని చెప్పామన్నారు. పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులపై ఉందని స్పష్టం చేశారు. వేచి చూడాలి ఈ టామ్ అండ్ జెర్రీ ఎపిసోడ్ ఇలాగే కొనసాగుతుందో లేక పుల్‌స్టాప్ పడుతుందో...

# దేవాలయాలకు మైక్‌సెట్లు వితరణ

రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త:



అందరూ గర్వించదగ్గ గొప్ప ధర్మం హిందూ ధర్మ అని ధర్మాన్ని మనం కాపాడితే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందని బీజేపీ యువ నేత వెంకటాద్రి యాదవ్ అన్నారు. రేణిగుంట మండలం వెంకటాపురంలో బంగారమ్మ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాలకు అఖిలభారత గణేష్ సేవాదళ్, ఏజీఎస్ చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ బోర్డు మెంబరు పేరం శెట్టి రాయలు ఆధ్వర్యంలో బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్ పర్యవేక్షణలో అతి విలువైన రెండు మైక్‌సెట్లు మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా రాములు, వెంకటాద్రి యాదవ్ మాట్లాడుతూ ఇరు సంధ్య వేలలో దేవాలయాల వద్ద భక్తి గీతాలను వినిపిస్తే ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన అలవడుతుందన్నారు. వచ్చే వినాయక చవితికి గ్రామం నుంచి సుమారు వంద మంది గణేష్ మాల దీక్ష స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ లీల నారాయణ ప్రభు, తిరుపతి కో–ఆర్డినేటర్ రాజ మనోహర్, గురుస్వామి, గోపి, తిరుపతి యూత్ ప్రెసిడెంట్ సాయితేజ, రాచపల్లి బాలాజీ, పీలేరు మహేష్, చందు, వెంకట సాయి, అఖిల భారత గణేష్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# దాడులను ఖండించిన క్రైస్తవ నేతలు

రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త:



క్రైస్తవులపై జరుగుతున్న దాడులను పాస్టర్స్ అసోసియేషన్ నేతలు ఖండించారు. రేణిగుంటలోని ఓ చర్చిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైస్తవ నేతలు మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ఖండించారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర క్రైస్తవ నాయకులు, పాస్టర్లు అరుల్ అరసు, బిషప్ రాజేంద్రన్, పాస్టర్ డేవిడ్ కరుణాకరన్, పాస్టర్ జైపాల్, పాస్టర్ పాల్‌రాజ్, డేనియల్, ఆశీర్వాదం, సగేయు, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త

ఈనెల 9వ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తిరుపతి పార్లమెంటు ఎస్‌టి సెల్ అధ్యక్షుడు యం. సుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9గంటలకు తిరుపతి పట్టణంలోని గిరి జన భవనంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసీ దినత్సోవంను అంగరంగ వైభంగా నిర్వహిస్తున్నారని గిరిజన సోదరులు హజరై విజయవంతం చేయాలనిపిలుపునిచ్చారు.


**GENERAL NOTICE**

Under instructions from my client Guntumadugu Vijay S/o. G.Devaraju Residing at D.No. 19-41-S9-1754, Postal Colony, Vinayak Nagar, Near Bliss Hotel, Tirupati Urban, Tirupati District issue the following general notice.

My client states that he is the absolute owner of the below schedule mentioned property under reigster sale deed and he has been in possession of enjoyment of property, while thing so, to the said property, one of the link original document vide Document No. 3709 of 2011 executed by M. Ramesh Kumar in favour of C.Ramesh has been in possession of document by my client. While do so, on 25.07.2024. While he was in shifting house from postal colony, Tirupati to Koniki Sidda Colony, Tirupati. My client has lost his original Link document vide document 3709 of 2011 dated : 17.10.2011. Inspite of his best efforts he could not traced out the original document, then he lodged complaint before tirupati East P.S. for the loss of document on 26.07.2024. After due probe the police issued non traceable certificate dated 04.08.2024.

Hence I therefore hereby call upon general public on behalf of my client that if anybody found or traced the original document or is having any claim, title, interest, financial Commitment or objections over sale deed documents. Please appraise the same within 7days from the date of publication

**Schedule:** Chittoor Revenue Dist. Sri Balaji Reg. Dist Tirupati - Tirupati Rural Sub Dist - Tirupati Rural Mandal, - Mundlapudi Gram paanchayat - Mundlapudi Village accounts Patta No.96, T.D. No.2401, Old S.No. 27/2, After survey New S.No. 527/20, 527/5 & 529/6 - within which established plots - Plot no.25 (Southern side Part) - Vacant Land - To an extent of 99.55 Sy. yds. East : 40' Road, West:Others Land , North: Plot No. 25(part) Northern Side part South: Plot No.26 Land.

**GALLA RAJESH BABU,**
**G.VIJAY,**
Advocates, Cell: 9440133217, 8639769178



**CHITTOOR URBAN DEVELOPMENT AUTHORITY**
**CHITTOOR**

Roc.No:108/2022/CHUDA Dated :05.08.2024

**E-procurement Short Tender Notice**

Tenders are invited from eligibile contractors for 1 No. work under CHUDA Funds 2024-25 for **Rs.4.00 Lakhs** on e-procurement by under signed.

| Sl.No | Bid down loading starting date and time | Last date & time for receipt of Bids |
|---|---|---|
| 1 | 07.08.2024 @ 4.00 PM | 19.08.2024 @ upto 3.00 PM |

Further details contact at 9490981057 during the office hours on all working days.

Sd/- P. Viswanath, Vice-Chairperson CHUDA

# ఇంటి దొంగను పట్టుకున్న పోలీసులు



నిందితుని అరెస్టు చూపిస్తున్న సిఐ చిన్నగోవిందు

గంగవరం,ఆగస్టు 6 ప్రభాతవార్త : తాళం వేసిన ఇంట్లో తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడి అనుమానస్పదంగా ఓ వ్యక్తిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంగవరం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అర్బన్ సిఐ చిన్నగోవిందు కథనం మేరకు వివరాలిలా..మండలంలోని కీలపట్ల గ్రామం కంసలవీధికి చెందిన కుమరేశ్ ఈ నెల 2వ తేదీన ఇంటికి తాళం వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్ళారు. ఈ నేపథ్యంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళాలను పగలగొట్టి ఇంట్లోకి చొరబడి పడకగదిలో ఉన్న బీరువాను ద్వంసం చేసి బీరువాలో దాచిన బంగారు నెక్లెస్‌ను చోరీ చేసినట్లు కుమరేశ్‌పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిఐ చిన్నగోవిందు తన బృందంతో కలిసి పాతనేరస్తులపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో కీలపట్లకు చెందిన గుర్రప్ప కుమారుడు గురుమూర్తి మంగళవారం ఉదయం మండలంలోని మేలుమాయి పంచాయతీ మేలుమాయి క్రాస్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుంటే అదుపులోకి తీసుకుని విచారించగా గురుమూర్తి కుమరేశ్ మామిడి తోపులో పనిచేసే వాడని, 2వ తేదీన కుమరేశ్ ఇంట్లో ఎవరు లేరని తెలుసుకొని తాళాలను పగలగొట్టి బీరువా అల్మారాలో దాచిన 32 గ్రాముల బంగారు నెక్లెస్‌ను చోరీ చేసి తన మిత్రుని సహాయంతో పలమనేరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో రూ.20,109లకు తాకట్టు పెట్టి వచ్చిన సొమ్మును ఇద్దరు జల్సాలకు ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చోరీకి గురైన బంగారు నెక్లెస్‌ను స్వాధీనం చేసుకొని, నిందితుని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# నలుగురు స్మగ్లర్లు అరెస్టు

## 12 ఎర్రచందనం దుంగలు, 2 మోటారు సైకిళ్లు స్వాధీనం

వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా వెంకటగిరి సమీపంలో 12 ఎర్రచందనం దుంగలతో పాటు, రెండు మోటారు సైకిళ్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పి ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పి పి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిఎస్పి చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పి. నరేష్ టీమ్ స్థానిక అటవీ అధికారుల సహాయంతో సోమవారం ఉదయం వెంకటగిరి ఫారెస్టు రేంజి చేరి, డక్కిలి అటవీ ప్రాంతం వైపు, సిసి కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళ్లారు. తెల్లవారు జామున వెంకటగిరి హిల్స్ చేరుకోగా, అక్కడ రెండు మోటారు సైకిళ్లతో కొంత మంది వ్యక్తులు కనిపించారు. వారిని సమీపించే సరికి వారు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వెంబడించి నలుగురిని పట్టుకోగలిగారు. వారిని వెంకటగిరి మండలానికి చెందిన దండుసురేంద్ర (34), పారవోలు పెంచలయ్య (42), త్రిపురాంతపల్లి వెంకటేష్ (44), రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్ బాబు (39)లుగా గుర్తించారు. వారి నుంచి దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు. వీరిని అరెస్టు చేసి తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేశారు. సిఐ సురేష్ కుమార్, దర్యాప్తు చేస్తున్నారు.



దుంగలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి చూపుతున్న పోలీసులు

## శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అదృష్టలక్ష్మి పూజలు



సూళ్లూరుపేట, ఆగస్టు 6 ప్రభాతవార్త : శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి దేవస్థానంలో అదృష్టలక్ష్మి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచి కామాక్షి వాసవి కన్యకా పరమేశ్వరిదేవి, లక్ష్మీదేవి, పంచ భూతాల సహిత పరమేశ్వరుని అష్టోత్తరములతో పూజలు నిర్వహించారు. 200 మంది మహిళా భక్తులు ఈ పూజలో పాల్గొని అమ్మవారిని భక్తితో సేవించారు. కన్యకా పరమేశ్వరి వాలంటీర్ సంఘ సభ్యుల పర్యవేక్షణలో కొనసాగింది.

## తడలో మళ్లీ భారీవర్షం...జలమయమైన రోడ్లు, వీధులు



తడ-శ్రీకాళహస్తి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తడ, ఆగస్టు 6 ప్రభాతవార్త : తడలో మంగళవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, వీధులు ఈ వర్షంతో జలదిగ్భంధంలో చిక్కుకున్నాయి. ముఖ్యంగా ఎప్పుడూ రద్దీగా ఉండే తడ-శ్రీకాళహస్తి రోడ్డులో నీళ్ల నిలిచిపోయాయి. ఈ రోడ్డులో వేలాది వాహనాలు పలు పట్టణాలకు, పారిశ్రామిక నగరాలకు వెళుతుంటాయి. అయితే తడలో మలుపు వద్ద ఎప్పుడూ రోడ్డును అధికారులు పట్టించుకోకపోవడంతో అక్కడ వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తడ, తడకండ్రిగ జంట పంచాయతీలలో ఇంటర్నల్ రోడ్లు, కొన్ని వీధులు వర్షానికి దెబ్బతి న్నాయి. అన్ని చోట్ల మురుగునీటి కాలువలు లేకపోవడంతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇదిలావుంటే ఈ వర్షంతో పాములకాలువ సమీపంలోని వరిపంట పొలాలు మరోసారి దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతానికి పంట నీటిలో పడి నానుతుందని వారు పేర్కొన్నారు.

## హెల్త్ సిబ్బందికి సన్మానం



డక్కిలి, ఆగస్టు 6 ప్రభాతవార్త : డక్కిలి మండలం డీ.వడ్డిపల్లి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ సిబ్బందిని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు బిందు ప్రియాంక, శ్రీహరిలు మంగళవారం ఘనంగా సన్మానించారు. డీవడ్డిపల్లి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటరును ఇటీవల హెల్త్ అండ్ వెల్త్ జాతీయ క్వాలిటీ వైద్యులు డాక్టరు సీమ, రామేశ్వరం పాండేలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఈ కేంద్ర నిర్వహణ బాగుందని జాతీయ స్థాయిలో ఈ సెంటరును ఎంపిక చేశారు. ఆ సెంటరులో పని చేస్తున్న సిబ్బంది సీహెచ్‌ఓ సాంబశివరావు, ఏఎన్ఎం మంజుల, ఆశావర్కర్ లతలను మంగళవారం సన్మానించి అభినం దించారు. వైద్యులు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిన డీ వడ్డిపల్లి వెల్‌నెస్ సెంటర్‌కు పురస్కార నిధులు విడుదలవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దాలిలో మంచినీటి పథకం ప్రారంభం



కోట, ఆగస్టు 6 ప్రభాతవార్త : కోట మండలం మద్దాలి గ్రామంలో రూ.29 లక్షలతో నిర్మించిన మంచినీటి పథకాన్ని (వాటర్ ట్యాంకు) గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ వారు అలాంటి కార్యక్రమాలు చేయకూడదని కోరారు. గతంలో ఈ మంచి నీటి పథకాన్ని తాను మంజూరు చేయించానని, తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పథకం ఆగిపోయిందని తెలిపారు. తాను అధికారులతో మాట్లాడి ఈ పథకాన్ని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నానని తెలిపారు. ఇక్కడి ప్రజల కోరిక మేరకు అరుంధతీయవాడ, హరిజనవాడల్లో సిమెంటు రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కనుపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన 287 ఎకరాల ప్రభుత్వ భూమిని 87 మంది పేదలకు ఇవ్వడం జరిగిందని, అయితే ప్రభుత్వం 287 ఎకరాలను బ్లాక్‌లిస్టులో పెట్టిందని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఆర్డీఓతో మాట్లాడి ప్రభుత్వ భూమిని బ్లాక్ లిస్టు నుంచి తొలగిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు లేని వారు ఎంతోమంది ఉన్నారని, వారందరికీ ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేయాలని, స్మశానానికి వెళ్లే దారి చూపించాలని, నీటి వసతి ఏర్పాటు చేయాలని శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మండల టిడిపి కన్వీనర్ సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, చిల్లకూరు దశరధరామిరెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, సతీష్, చంద్రయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కనుపూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు.

## ప్రారంభమైన ఫ్లై ఓవర్ పనులు



చిల్లకూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త : చిల్లకూరు సాగర్ మాల ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళవారం వరగలి క్రాస్ రోడ్ వద్ద ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా మెగా సంస్థ సిబ్బంది మాట్లాడుతూ జాతీయ రహదారిని కలుపుకొని తీర ప్రాంత గ్రామాల్లోకి వెళ్తున్న ఆరు వరసల రహదారికి సంభందించి ఫ్లై ఓవర్ పనులు ప్రారంభమైయ్యాయన్నారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మరొక రోడ్డు మార్గాన్ని తాత్కాలికంగా ఏర్పటు చేయడం జరిగిందన్నారు. జాతీయ రహదారి పై వెళ్ళే వాహనదారులు గమనించి తమ గమ్యస్థానాలకు వెళ్ళాలని పేర్కొన్నారు. సాగరమాల అంచనా వ్యయం 686.6 కోట్ల రూపాయిలతో ప్రారంభం అయిందని 2025 సంవత్సరం నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సాగర మాల ప్రాజెక్టు 36 కె.మీల పరిధిలో 12 గ్రామాల మీదుగా తూర్పు కనుపూరు గ్రామం మీదుగా కృష్ణపట్నం పోర్టు దక్షిణ ముఖం గేట్ వరకు పూర్తి చేయనున్నారు. ఈ రహదారి ఏర్పడిన తరువాత వాహన దారులు, సురక్షితంగా తక్కువ సమయంలో వారి గమ్యాలకు చేరే అవకాశం ఉందన్నారు.

## రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి!

దొరవారిసత్రం, ఆగస్టు 6 ప్రభాతవార్త : మండలంలోని మానేరి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో మధనంబేటి మురళి(40)అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిట్టమూరు మండలం కలుగుర్తిపాడు గ్రామానికి చెందిన మధనంబేటి మురళి మోటార్‌సైకిల్‌పై అపాచి కంపెనీకి వెళ్ళి డ్యూటి ముగించుకొని తిరిగి స్వగ్రామమైన కలుగుర్తిపాడుకు వస్తుండగా మార్గమధ్యలో దొరవారిసత్రం మండలం మానేరి వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో ప్రమాదవశాత్తు మోటార్‌సైకిల్ ఢీకొంది. దీంతో గేదెతోపాటు మధనంబేటి మురళి అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకొన్న దొరవారిసత్ర ం పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలించారు. అనంతరం పంచనామా నిమిత్తం మృతదేహన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రిలో కుటుంబ సభ్యులు రోదన పలువురిని కంటతడి పెట్టించి ంది. దొరవారిసత్రం పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విశేష పూజలందుకున్న శ్రీసుగుటూరు గంగమ్మ



పుంగనూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: ఊరిదేవత, జనమంతా తల్లిగా భావించే శ్రీసుగుటూరు గంగమ్మ దేవతకు మంగళవారం విశేషంగా పూజలు జరిగాయి. పట్టణంలో వెలసిన శ్రీసుగుటూరు గంగమ్మ ఆలయంలో ఉదయం నుంచి వందలాది మంది భక్తులు అమ్మవారిపూజలలో పాల్గొన్నారు. ఏడాదికి ఒక్కసారి జరిగే అమ్మవారి జాతరలో మొక్కులు చెల్లించేందకు ప్రతి మంగళవారం అమ్మవారి ఆలయానికి వచ్చి, తమ కోరికలు కోరుకుని మొక్కులు చేసుకుంటారు. అందరినీ కరుణించే అమ్మవారి దయతో మొక్కులు తీరిన తరువాత జాతర రోజున భక్తులు తాము చేసుకున్న మొక్కులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఇది వందలాది ఏళ్లుగా జరుగుతున్న సాంప్రదాయం. ఈక్రమంలో మంగళవారం ఉదయం అమ్మవారి పూజలలో పట్టణానికి చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధితో గిరిజన విద్యార్థిని మృతి!



సోమల, ఆగస్టు 6 ప్రభాతవార్త : సోమల మండలం 81 చిన్నప్పరపల్లి పంచాయితీ ఇర్లపల్లికి చెందిన ఏడవ తరగతి విద్యార్థిని సరికింటి పూర్ణిమ డెంగ్యూ వ్యాధితో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇర్లపల్లికి చెందిన వెంకటరామయ్య, ఈశ్వరమ్మల కుమార్తె పూర్ణిమ పుంగనూరులోని మేలు పట్ల పాఠశాలలో ఏడవ తరగతి విద్య అభ్యసిస్తోంది. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహించే వసతి గృహంలో ఉంటూ చదువు కొనసాగిస్తోంది. పది రోజులుగా అమ్మాయి జ్వరంతో బాధపడుతున్న తమకు సమాచారం అందివ్వలేదని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల క్రితం తెలిసిన వారి నుంచి తమ బిడ్డకు జ్వరం ఉందని తెలుసుకుని వెళ్లి పిలుచుకుని వచ్చామని వారు తెలుపుతున్నారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లగా అక్కడి వైద్యులు విద్యార్థినికి డెంగ్యూ జ్వరమని ఆలస్యంగా తీసుకోవడం వల్ల ప్రాణాన్ని కాపాడలేకపోయామని వారు తెలిపారు. విద్యార్థిని తల్లి ఈశ్వరమ్మ వాపోయారు. వసతి గృహంలో కూడా పారిశుద్ధ్యం పూర్తిగా క్షీణించిందని అందువల్లే వ్యాధులు వస్తున్నాయని తమ బిడ్డకు జరిగిన అన్యాయం వేరే బిడ్డకు జరగకూడదని ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## చిత్తూరులో రీ-యుజబుల్ బ్యాగుల తయారీ పరిశ్రమ

### - సంస్థ ప్రతినిధులతో బెంగళూరులో ఎమ్మెల్యే గురజాల సమావేశం

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: చిత్తూరులో రీ-యుజబుల్ బ్యాగుల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆ సంస్థ ప్రతినిధులతో పేర్కొన్నారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు రీ-యుజబుల్ బ్యాగుల పరిశ్రమల ప్రతినిధులతో మంగళవారం బెంగళూరులో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రం చిత్తూరు పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు వున్నాయని, పరిశ్రమలు ఏర్పాటు అయితే ఇక్కడి నిరుద్యోగ యువతకు ఉపాధి లభించే అవకాశం వుంటుందన్నారు. చిత్తూరు పరిసరాల్లో కచ్చితంగా రీ-యుజబుల్ బ్యాగుల పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆ సంస్థ ప్రతినిధులను ఎమ్మెల్యే కోరగా దీనిపై ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఎన్ఆర్ఐ రవితేజ, ముత్తులతో పాటు ఆసంస్థప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం కేసులో ఐదుగురు అరెస్టు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త: మండల పరిధిలో పిళ్ళారికుప్పం వద్ద పోలీసులు పట్టుకున్న ఎర్రచందనం దుంగల కేసులో ఐదు మంది నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాజకుల్లాయప్ప పేర్కొన్నారు. ఎస్ఐ రాజకుల్లాయప్ప వెల్లడించిన వివరాల మేరకు పిళ్ళారికుప్పం గ్రామంకు చెందిన సుదర్శనం(21), బాలాజీరెడ్డి(32), చరణ్(29), గురువయ్య(39), మోహన్(38)లను ఈ కేసులో అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరందరు స్నేహితులని, వీరు గత నెల 23న సమావేశమై పిళ్ళారికుప్పం గ్రామంకు సమీపంలో వున్న మాజీ సైనికుడు రవికుమార్ మామిడి తోపులో డంప్ చేయబడిన ఎర్రచందనం దుంగలను దొంగలించాలని పథకం వేశారన్నారు. ఈ పథకం ప్రకారం అదే రోజు రాత్రి 10 గంటలకు ఒక ట్రాక్టర్‌ను తీసుకువచ్చి వాచ్‌మెన్ లేని సమయంలో 37 ఎర్రచందనం దుంగలను దొంగలించి అక్కడి నుండి వెంకటాపురం గ్రామానికి వెళ్ళే దారిలో చెరువు ప్రక్కన కొండ కనుమ ముళ్ళ పొదల్లో డంప్ చేశారన్నారు. ఈ మేరకు ఈ నెల 5వ తేదీ పోలీసులకు రాబడిన సమాచారం మేరకు తాను సిబ్బందితో వెళ్ళి డంప్ చేసిన ఎర్రచందనం దుంగలను పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## కేరళ వరద బాధితులకు ఆటో డ్రైవర్ ఆర్థిక సహాయం

చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త: కేరళ వరద బాధితుల కోసం గుడిపాల మండలం 189-కొత్తపల్లి గ్రామంకు చెందిన ఆటోడ్రైవర్ జి.రమేష్‌బాబు కేరళ రాష్ట్ర సహాయనిధికి తన ఒక రోజు సంపాదన 3,300 రూపాయలను విరాళంగా అందజేశాడు. ఇటీవల కేరళ రాష్ట్రంలో వరదలు ముంచెత్తడంతో ఆ రాష్ట్రం అతలాకుతలం అయ్యింది. కేరళ రాష్ట్ర వరద బాధితులను ఆదుకోవడానికి దేశ వ్యాప్తంగా విరాళాల సేకరణ జరుగుతుంది. ఈ క్రమంలో గుడిపాల మండలం 189-కొత్తపల్లి గ్రామంకు చెందిన ఆటోడ్రైవర్ జి.రమేష్‌బాబు తాను ఆటో నడిపితే వచ్చిన ఒక రోజు మొత్తంను కేరళ వరదబాధితులకు అందజేయాలని నిర్ణయించాడు. ఈ మేరకు తన ఒక రోజు సంపాదన రూ.3,300 రూపాయల చెక్కును మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి అందజేశారు. ఆటోడ్రైవర్ రమేష్‌బాబును కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు.

## నిత్యాన్నదాన పథకానికి 1.25 లక్షలు



కాణిపాకం, ఆగస్టు 6 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు మంగళవారం 1.25 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు ఏలూరుకు చెందిన బాలకృష్ణ అనే భక్తుడు నిత్యాన్నదానంకు 1.25 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. విరాళ మొత్తాన్ని దాతలు కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

## శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతరకు చాటింపు



రేణిగుంట, ఆగస్టు 6 ప్రభాతవార్త: రేణిగుంటలో కొలువుతీరిన భక్తుల పాలిట కొంగు బంగారం, అమ్మలగన్న అమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఎంతో పెద్దమ్మ రేణిగుంట గ్రామదేవత శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతర అంకురార్పణలో భాగంగా మంగళవారం రాత్రి రేణిగుంటలో చాటింపు చేశారు. ముందుగా దేవస్థానం శాశ్వత ధర్మకర్త, గుడి ఛైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, వీఆర్ రావణన్, సదాశివరెడ్డి తదితరులు దేవాలయం వద్ద అర్చకుల ద్వారా విశేష పూజలు నిర్వహించి, కొబ్బరికాయలు అమ్మవారికి సమర్పించి జాతరను నిర్విఘ్నంగా జరిపించాలని అమ్మవారిని ప్రార్థించారు. రేణిగుంట వాసులంతా చల్లంగా చూడమ్మ తల్లి అంటూ చాటింపు వేయించారు. చాటింపుతో అమ్మవారి జాతర తొలి ఘట్టం ప్రారంభమైనట్లే. 12వ తేదీసోమవారం అమ్మవారి గెరిగె రేణిగుంట వీధుల్లో ఊరేగిస్తారు. 13న మంగళవారం అమ్మతల్లి గుడి వద్ద భక్తులు పొంగళ్లు, 14న బుధవారం గంగమ్మ నడివీధి శూలం వద్ద శ్రీశ్రీ గంగమ్మ తల్లి విశ్వరూప ప్రతిమను ప్రతిష్టించి దర్శనభాగ్యాన్ని కల్పిస్తారని ఛైర్మన్ సోలా మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.

## స్విమ్స్‌లో బిఎస్సి విద్యార్థిని నిజాయితీ



తిరుపతి హెల్త్, ఆగస్టు 6, ప్రభాతవార్త : స్విమ్స్ శ్రీ పద్మావతి హాస్పిటల్‌లో సర్జికల్ అంకాలజీలో చికిత్స చేసుకుంటున్న అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరుకు చెందిన మన్నురు పార్వతమ్మ అనే పేషంట్ పొరపాటున తన హ్యాండ్ పర్స్‌ను జారవిడుచుకోవడం జరిగింది. ఈ నెల 3వ తేది సాయంత్రం స్విమ్స్ నందు బిఎస్సి 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పి. జోషవి పర్సును చూసి అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి అందజేసింది. అనంతరం పర్సును తనిఖీ చేయగా అందులో రూ. 2025 నగదు, ఒక ఎటిఎం కార్డు, ఇంటి తాళాలు గుర్తించడం జరిగింది. అనంతరం పేషంట్ వివరాలు కనుక్కొని , పేషెంట్, వారి సహాయకులను పిలిపించి పర్సుతో పాటు 2025 నగదు ఎటిఎం కార్డు, ఇంటి తాళాలు ఈ నెల 5వ తేది సోమవారం సాయంత్రం 5 గంటలకు అప్పగించి వారి ద్వారా అంగీకరపత్రం స్వీకరించి ఆ పర్సును అందించారు. పర్సు అందుకున్న మన్నురు పార్వతమ్మ వీరి సహాయకులు సుష్మిత తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, స్విమ్స్ యాజమాన్యానికి, సెక్యూరిటీ సిబ్బందికి, పర్సు అందించిన విద్యార్థిని జోషవికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్విమ్స్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇలంగోవన్ రెడ్డి, సూపర్వైజర్ వై. జగన్నాథం, సెక్యూరిటీ గార్డు ఎం. దేవేంద్ర కుమార్‌లను స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ ప్రశంసించారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులు ప్రారంభం



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 6 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా మహిళా ప్రాంగణం సహాయ సహకారంతో స్థానిక మహిళా ప్రాంగణంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులను మూడు రోజులు పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిఎం ఫర్జానా విచ్చేసి మాట్లాడుతూ ఈ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారడానికి కావాల్సినటు వంటి మెలకువలు, వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు గురించి మహిళలు వ్యాపారంలో రాణించటానికి కావాల్సిన వివిధ రకాల అనుమతులు గురించి తెలిపారు. అనంతరం రీజనల్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్, ఏపీ ఎస్ఎస్‌డిసి శ్యామ్మోహన్ మాట్లాడుతూ ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్నటువంటి వ్యాపార అవకాశాల గురించి అలాగే ప్రాజెక్టు రిపోర్ట్ తయారీ, మార్కెట్ మెలకువలు, నిర్వహణ శక్తి సామర్థ్యం గురించి, ఖాతా పుస్తకాలు నిర్వహణ, వ్యాపారంలో పాటించాల్సినటువంటి నియమ నిబంధనలు గురించి అలాగే ఉత్పత్తి సామర్థ్యం, సేల్స్ మార్కెటింగ్ పై పూర్తి సమాచారాన్ని తెలిపారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం మాట్లాడుతూ ఈ సంవత్సరంకు రెండు ప్రోగ్రామ్లను ఐఎల్ఓ, ఏపీఎస్ఎస్‌డిసి, ఆధ్వర్యంలో స్థానిక మహిళ ప్రాంగణ వారి సహకారంతో జిల్లాలో ఉన్నటువంటి చదువుకొని ఖాళీగా ఉన్నటువంటి నిరుద్యోగ మహిళలకి మూడు రోజులు పాటు ఔత్సాహిక వ్యాపారవేతకు కావాల్సినటువంటి సూచనలు సలహాలు అలాగే వివిధ రకాల డిపార్ట్మెంట్ల నుంచి ముఖ్యంగా జిల్లా పరిశ్రమల కేంద్రం, పరిశ్రమల అనుమతులకు సంబంధించి, అలాగే బ్యాంకింగ్ రంగం సంబంధించి స్టాండ్ అప్ ఇండియా ముద్ర లోన్స్, పీఎంఈజీపీ లోన్స్ ఇతర ఎస్ఎస్‌జిలోన్ సంబంధించిన మెప్మా డిపార్టెంట్ వారి సహాయ సహకారాలతో రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహవంతులైన మహిళలు 30 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎల్వో మూస్టర్ ట్రైలర్ హేమాద్రి, ఏపి ఎస్ఎస్‌డిసి, ట్రైనర్, సునేషు, మురళీకృష్ణ, ఏడిఎస్‌డిఓ ప్రతాప్ మహిళా ప్రాంగణం, ఏపిఎస్ఎస్ డిసి సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీలలో పాల్గొనడం వలన మేదో శక్తి పెంపొందుతుంది



తిరుపతి విద్య, ఆగస్టు 6 ప్రభాతవార్త : శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఇస్కాన్ సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి డిబేట్ పోటీలో శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. నారాయణమ్మ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి నారాయణమ్మ మాట్లాడుతూ ఇటువంటి పోటీలలో విద్యార్థినిలు విరివిగా పాల్గొనడం వలన మేధాశక్తి పెంపొందుతుందన్నారు. ఉన్నత చదువులలో కూడా ఈ పోటీ విధానం కొనసాగాలని పిలుపునిచ్చారు. కో కరికులం కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ డిబేట్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనడం వలన ధైర్యం, మాట్లాడే విధానంలో మెలకువలు అలవాడుతాయి అన్నారు. మొదటి బహుమతి ఎం. పరిమళ శ్రీ, బిఏ రెండవ సంవత్సరం, పి. చందన, బిఏ రెండవ సంవత్సరం, ద్వితీయ బహుమతి ఈ లావణ్య, బిఏ తృతీయ సంవత్సరం, పి. లలిత, బిఏ ద్వితీయ సంవత్సరం, తృతీయ బహుమతి సి. పుష్ప లక్ష్మి, బిఏ. తృతీయ సంవత్సరం, వి. అంబికా, తృతీయ సంవత్సరం, బీకాం సిఏ సాధించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను అధ్యాపక బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భద్రమణి, హాస్టల్ వార్డెన్ హేమలత, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ వసుధ, డాక్టర్ శోభ పాల్గొన్నారు.

## అనధికార ప్రజాప్రతినిధులపై తెదేపా నేతల ఆగ్రహం



రామకుప్పం, ఆగస్టు 6 ప్రభాతవార్త : రామకుప్పం మండల కార్యాలయంలోకి వచ్చి అధికారిక కుర్చీల్లో కూర్చుంటున్న అనధికార ప్రజాప్రతినిధులపై స్థానిక దేశం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిని కార్యాలయం నుంచి బయటకు రప్పించాలని అధికారుల ఎదుట డిమాండ్ చేశారు. ఈ సంఘట నకు సంబంధించి వివరాలిలా.. మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని మండల కార్యాలయంలో నిర్వహించారు. గతంలో ఎంపిపిగా ఉన్న శాంతకుమారి మృతి చెందారు. ఈమె భర్త వైకాపా నేత చంద్రారెడ్డి, మరికొందరు మంగళవారం మండల కార్యాలయంకు వచ్చి ఎంపిపి ఛాంబరులోని కుర్చీలో కూర్చ్చవడం పట్ల దేశం నేతలు మండిపడ్డారు. అనధికారంగా వైకాపా నేత ఎలా కార్యాలయంలో వచ్చి కూర్చుంటారని ఎంపిడిఓ ఈశ్వరయ్యను ప్రశ్నించారు. దీంతో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. అనంతరం పోలీసుల జోక్యంతో వైకాపా నేతలను కార్యాలయం నుంచి బయటకు రప్పించడంతో దేశం శ్రేణులు అక్కడనుంచి వెనుతిరిగారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ, నేతలు రామూర్తి, జయశంకర్, మనోహర్, చిన్నికృష్ణ, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పని సర్దుబాటు పేరుతో పాఠశాలల మూసివేత తగదు

### -ఎస్‌టియు రాష్ట్ర నేత నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త: పని సర్దుబాటు పేరుతో పదిమందిలోపు ఉన్న విద్యార్థుల ప్రాథమిక పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వ ఆలోచనలు ఉపసంహరించుకోవాలని ఎస్‌టియు రాష్ట్ర నేత మూసివేయాలని ఎస్‌టియు రాష్ట్ర నేత గాజులనాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అంజూరు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం అనుసరించిన విద్యారంగ వ్యతిరేఖ విధానాల వల్ల ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైందన్నారు. జీవో నంబర్ 117 అమలు ద్వారా ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక బలహీన పడ్డాయన్నారు. 4వేలకు పైగా పాఠశాలలో 10 మంది లోపు విద్యార్థులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చిందన్నారు. 22వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం పనిసర్దుబాటు పేరుతో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చడం వల్ల మరిన్ని పాఠశాలల్లో టీచర్లు లేక విద్యాప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. జీవో నంబర్117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు మాట్లాడుతూ పని సర్దుబాటు ప్రక్రియను టేస్‌డేటా ద్వారా ఆన్లైన్‌లో కాకుండా జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు. గత ప్రభుత్వం నియమించిన వేతన సవరణ కమిటీ ఛైర్మన్ మన్మోహన్ సింగ్ రాజీనామా చేసిన నేపథ్యంలో వెంటనే పిఆర్సీ ఛైర్మన్‌ను నియమిం చాలని కోరారు. హెచ్ఎం రాయపేడు మురళీధర్, డివిజన్ కన్వీనర్ సుధాకర్, ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్ చిరిహరికృష్ణ, నాయకులు నాగూర్, సునీల్, రాయరవి, పురంధర్, చంద్ర, దాము తదితరులు పాల్గొన్నారు.




